

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | బుధవారం 21 ఏప్రిల్ 2021 సంపుటి : 02 | సంచిక : 282 | పేజీలు : 4 | వెల : రూ 3-00

### అదృశ్య శత్రువుపై సమిష్టిగా యుద్ధం చేస్తేనే

# వైరస్ గొలుసు విచ్ఛిన్నం

### గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్



కరోనా వ్యతిరేక అవగాహనా ప్రచారంలో విద్యార్థుల భాగస్వామ్యం అవసరంవిశ్వవిద్యలయాల ఉపకులపతులతో గవర్నర్ దృశ్య శ్రవణ విధాన సదస్సువిజయవాడ కరోనా మహమ్మారి విసిరిన భారీ సవాలును ఎదుర్కోవటానికి ఉపకులపతి మొదలు విద్యార్థి వరకు అందరూ బాధ్యతాయుతమైన పాత్రను పోషించాలని గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. అదృశ్య శత్రువుపై అందరూ సమిష్టిగా యుద్ధం చేస్తేనే వైరస్ గొలుసును విచ్ఛిన్నం చేయగలుగుతామన్నారు. విజయవాడ రాజ్ భవన్ వేదికగా ఉన్నత విద్యసంస్థలలో కరోనా పరిస్థితులను అధికమించటం, విద్యార్థుల ద్వారా కరోనా వ్యతిరేక అవగాహనా ప్రచారం నిర్వహించటంపై గవర్నర్ రాష్ట్రంలోని అయా విశ్వవిద్యాలయాల ఉపకులపతులతో వెబినార్ విధానంలో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, విద్యా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్ర,రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ అచార్య కె. హేమచంద్రరెడ్డి, గవర్నర్ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా రాజ్ భవన్ నుండి కార్యక్రమంలో పాల్గొనగా, విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, రిజిస్ట్రార్లు దృశ్యశ్రవణ మాధ్యమ విధానంలో సదస్సులో పాల్గొన్నారు. రెండోవ విడత కరోనా వ్యాప్తి వేగవంతమైన తరుణంలో విద్యాసంస్థలలో అవసరమైన అన్ని ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా గౌరవ గవర్నర్ పేర్కొన్నారు. ఉన్నత విద్యాసంస్థలు ప్రజల పట్ల పెద్ద బాధ్యత కలిగిఉన్నాయని, ప్రజలలో అవగాహన కలిగించేందకు కృషి చేయవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు తమను తాము కాపాడుకుంటూ అటు కుటుంబానికి, ఇటు సమాజానికి మధ్య దూతలుగా వ్యవహరించాలని సూచించారు. గౌరవ బిశ్వభూషణ్ మాట్లాడుతూ కోవిడ్ మహమ్మారి వ్యాప్తి నివారణకు ఎన్‌సిసి,ఎన్ఎస్ఎస్ బృందాల సహకారం తీసుకోవాలన్నారు. నిత్యం పెరుగుతున్న కరోనా కేసులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో విజయం సాధించడానికి మనమంతా కలిసి యుద్ధప్రాతిపదికన అవగాహన కార్యక్రమాలు చేపట్టడం అత్యావశ్యకమన్నారు. ప్రస్తుత ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయిడు, గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏప్రిల్ 8, ఏప్రిల్ 14న ముఖ్యమంత్రులతో సమిక్షించారని, 'పరీక్షలు, ట్రేసింగ్, ట్రీట్మెంట్, ప్రవర్తనా నియమావళి అమలు, టీకా' అనే ఐదు అంశాల వ్యూహాన్ని అమలు చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారని గవర్నర్ గుర్తు చేసారు. పౌర సమాజం, ప్రముఖ వ్యక్తులు,మత పెద్దలు,ప్రజా ప్రతినిధులతో పాటు, కరోనా జాగ్రత్తల గురించి అవగాహన కల్పించడానికి విశ్వవిద్యాలయాలు, విద్యార్థులు చురుకైన ప్రచారం చేపట్టాలని ప్రధాని సూచించారన్నారు. ఇప్పటికే రెడ్ క్రాస్ ప్రతినిధులతో రాష్ట్ర స్దాయి సమావేశం నిర్వహించి అవసరమైన చర్యలకు అదేశాలు జారీ చేసామని, అయా జిల్లా యంత్రాంగాలతో రెడ్ క్రాస్ యూనిట్లు సమన్వయంతో ముందుకు వెళుతున్నాయని పేర్కొన్నారు. కొవిడ్ 19 వైరస్ మన దైనందిన జీవితాన్ని స్తంభింప చేయటమే కాక, ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేసిందన్నారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాలలోని ప్రతి విద్యార్థి రెడ్‌క్రాస్ మొబైల్ యాప్ ఉపయోగించి తగిన ప్రచారాన్ని చేపట్టాలన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ కనీసం ఐదు ఇళ్లను సందర్శించి రెడ్ క్రాస్ యాప్ ద్వారా సామాజిక నిఘా వైపు దృష్టి సారించాలని సూచించారు.

సామాజిక నిఘాలో విద్యార్థుల పాత్రకు సంబంధించి రాజ్ భవన్ వారిని ప్రత్యేకంగా అభినందిస్తుందని , ప్రతి జిల్లాలో 10 ఉత్తమ కళాశాలలు, రాష్ట్రంలోని 3 ఉత్తమ విశ్వవిద్యాలయాలను ఇందుకు ఎంపిక చేస్తామని గవర్నర్ బిశ్వభూషణ్ హరించందన్ స్పష్టం చేసారు.

# వ్యాక్సిన్ మాన్యుఫ్యాక్చరర్లతో మోదీ భేటీ



న్యూఢిల్లీ : కోవిడ్-19 నిరోధక వ్యాక్సిన్ మాన్యుఫ్యాక్చరర్లతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు సమావేశం కాబోతున్నారు. దేశవ్యాప్తంగా కోవిడ్-19 కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఆయన నిర్వహిస్తున్న మూడో సమావేశం ఇది.సోమవారం మోదీ నిర్వహించిన వరుస సమావేశాల్లో అత్యున్నత స్థాయి వైద్యులు, ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సమావేశాల అనంతరం విడుదలైన ప్రకటనలో దేశవ్యాప్తంగా మే 1 నుంచి 18 సంవత్సరాల వయసు పైబడినవారందరికీ వ్యాక్సినేషన్ చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు వర్చ్యువల్ పద్ధతిలో జరిగే సమావేశంలో మన దేశంతోపాటు ప్రపంచంలోని అత్యున్నత స్థాయి వ్యాక్సిన్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీల ప్రతినిధులతో మోదీ చర్చలు జరుపుతారని తెలుస్తోంది. ఈ సమావేశంలో పాల్గొనేవారికి సమన్వయకర్తగా బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్ వ్యవహరిస్తుందని సమాచారం.మే 1 నుంచి 18 సంవత్సరాల వయసు పైబడినవారందరికీ వ్యాక్సినేషన్ చేయబోతున్న నేపథ్యంలో వ్యాక్సిన్ల ఉత్పత్తిని పెంచేందుకు మాన్యుఫ్యాక్చరర్లను ప్రోత్సహించడమే లక్ష్యంగా మోదీ ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం కోసం ప్రైవేటు రంగానికి తలుపులు తెరవడం వల్ల వ్యాక్సిన్ల సరఫరా ఊపందుకుంటుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రైవేటు రంగానికి సరసమైన ధరలకు అమ్ముకోవడానికి మాన్యుఫ్యాక్చరర్లకు ప్రోత్సాహకరంగా ఉంటుందని, అదే సమయంలో మన దేశానికి కొత్త మాన్యుఫ్యాక్చరర్లు వచ్చే అవకాశం ఉంటుందని భావిస్తోంది.


# కోవిద్‌పై ఏపీ సిఎం కీలక నిర్ణయాలు

### మాస్కుల్లేక పోతే రూ.100 ఫైన్
### వాలంటీర్లతో మరోసారి సర్వే...
### - పరీక్షలపై నిర్ణయం అప్పుడే ?



అమరావతి ( విభారె ప్రతినిధి) ఏపీలో కరోనా కేసుల కల్లోలం కొనసాగుతోంది. వేలకు వేలుగా వస్తున్న కొత్త కేసుల నేపథ్యంలో ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. వీటిని క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేయాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. ఇందులో మాస్కుల వాడకం, భౌతిక దూరం నిబంధనలతో పాటు విద్యార్థులు, విద్యాసంస్థలకు సంబంధించిన పలు నిర్ణయాలు ఉన్నాయి. పరిస్థితి బట్టి పదో తరగతి, ఇంటర్ పరీక్షల రద్దుపై నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. జగన్ కీలక నిర్ణయాలుఏపీలో కరోనా పరిస్థితిపై నిన్న అధికారులతో కీలక సమీక్ష నిర్వహించిన సీఎం జగన్ పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో కరోనా కేసుల వ్యాప్తి నేపథ్యంలో రాష్ట్రంలో విద్యాసంవత్సరాన్ని ఇంతటితో ముగించాలని నిర్ణయించారు. 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు మాత్రమే ఇది వర్తిస్తుంది. ప్రస్తుతానికి పదో తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణకే ప్రభుత్వం మొగ్గు చూపింది. క్షేత్రస్థాయిలో కరోనా కట్టడికి సీఎం జగన్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఇవన్నీ ఇవాళ్టి నుంచి అమల్లోకి రాబోతున్నాయి.

**కోవిడ్ కొత్త మార్గదర్శకాలు** : ఏపీలో కరోనా విజృంభణ నేపథ్యంలో మాస్కు వాడకాన్ని పూర్తిస్దాయిలో తప్పనిసరి చేయాలని అధికారులకు సీఎం జగన్ ఆదేశాలిచ్చారు. దీంతో ఇవాళ్టి నుంచి మాస్కు లేకపోతే రూ.100 జరిమానా విధించబోతున్నారు. అలాగే హోటళ్లు, సినిమా హాళ్లు, కన్వెన్షన్ సెంటర్లలో భౌతిక దూరం నిబంధనల్ని పకడ్బందీగా అమలు చేస్తారు. హోటళ్లలో కుర్చీకీ, కుర్చీకీ మధ్య ఆరడుగుల దూరం అమలు చేయబోతున్నారు. అలాగే సినిమా హాళ్లలో కుర్చీకీ, కుర్చీకి మధ్య ఓ కుర్చీ వదిలేయాల్సి ఉంటుంది. అలాగే బహిరంగ ప్రదేశాల్లోనూ భౌతిక దూరం నిబంధనలు కచ్చితంగా అమలు చేస్తారు.



**వాలంటీర్లతో మరోసారి సర్వే :** రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, వార్డుల పరిధిలో ఉన్న వాలంటీర్లతో స్థానికంగా సర్వే చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎవరైనా కోవిడ్ లక్షణాలతో బాధపడుతున్నారేమో వీరు గుర్తిస్తారు. వెంటనే వారికి కోవిడ్ పరీక్షలు చేయిస్తారు. అనంతరం అవసరాన్ని బట్టి ఆస్పత్రులకు పంపి చికిత్స అందిస్తారు. ఇందుకోసం ముందుగా సర్వే నిర్వహించబోతున్నారు. గతేడాది కూడా ప్రభుత్వం పలు దఫాలుగా వాలంటీర్లతో సర్వేలు చేయించి బాధితుల్ని గుర్తించింది. మరోసారి ఇలా బాధితుల గుర్తింపు చేపట్టడంతో పాటు పెద్ద ఎత్తున పరీక్షల నిర్వహణకు సిద్ధమవుతున్నారు.

**పరిస్థితిని బట్టి పదోతరగతి, ఇంటర్ పరీక్షలు :** కీలకమైన పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలపై ప్రస్తుతానికి కొనసాగింపు నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. పరిస్థితిని నిశితంగా గమనిస్తోంది. ఇతర రాష్ట్రాల తరహాలో వెంటనే పరీక్షలు రద్దు చేస్తే విద్యార్థులు నష్టపోతారని భావిస్తున్న ప్రభుత్వం కేసుల పరిస్థితిని బట్టి టెన్త్, ఇంటర్ పరీక్షలపై నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించింది. ఇప్పటికే విద్యార్థులకు కొనసాగుతున్న క్లాసులను కూడా కొనసాగించబోతున్నారు. పరీక్షలు జూన్‌లో ఉన్నందున, ఆ లోపు ఏ క్షణాన అయినా తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.


### కరోనాతో ఒకే కుటుంబంలో

# నలుగురు మృతి



విజయవాడ:( విభారె ప్రతినిధి) ఏపీలో రోజురోజుకు కరోనా విజృంభిస్తోంది. గతంలో వయస్సు పైబడినవారినే టార్గెట్ చేసిన కరోనా.. ఈసారి వయసుకు సంబంధం లేకుండా ఆ వైరస్‌కు ఇష్టం వచ్చిన రీతిలో కోరలు చాపుతూ....యువతను కూడా బలి తీసుకుంటుంది. ఇప్పటికే పలు కుటుంబాల్లో పలువురి ప్రాణాలను పొట్టనబెట్టుకున్న కరోనా... తాజాగా విజయవాడలో ఒకే కుటుంబంలో నలుగురిని పొట్టనబెట్టుకుంది. నాలుగురోజుల క్రితం కరోనా వైరస్‌తో పాతబస్తీకి చెందిన లాయర్ దినేష్(37) మృతి చెందాడు. ఇవాళ తెల్లవారుజామున దినేష్ తండ్రి మృతి చెందాడు. 3 రోజుల క్రితం కరోనాతో దినేష్ తల్లి, బాబాయ్ కన్నుమూశారు. మొత్తానికి ఒకే కుటుంబంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో ఆ నగరంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

### కరోనాతో సీనియర్ జర్నలిస్టు అమర్‌నాథ్ మృతి



హైదరాబాద్( విభారె ప్రతినిధి) : తెలంగాణలో కరోనా వైరస్ చాప కింద నీరులా విస్తరిస్తోంది. కరోనాతో సీనియర్ జర్నలిస్టు అమర్‌నాథ్ మృతి చెందారు. గత పది రోజుల క్రితం అమర్‌నాథ్‌కు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో ఆయన నిమ్స్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం కన్నుమూశారు. జర్నలిస్టు అమర్‌నాథ్ మృతిపట్ల వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్, పలువురు మీడియా ప్రతినిధులు సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# లాక్‌డౌన్ లేదు

### హైకోర్టు ఆదేశాలను నిలిపివేసిన సుప్రీం



న్యూఢిల్లీ: కరోనా కేసులు పెరుగుతున్న కారణంగా ప్రయాగ్‌రాజ్, లక్నో, వారణాసి, కాన్పూర్ నగర్, గోరఖ్‌పూర్ సహా నగరాల్లో ఏప్రిల్ 26 వరకు లాక్‌డౌన్ విధించాలని అలహాబాద్ హైకోర్టు సోమవారం సంచలన ఆదేశాలు ఇచ్చింది. కాగా ఈ ఆదేశాలను దేశ అత్యున్నత న్యాయస్థానం నిలిపివేసింది. ఆ ఐదు నగరాల్లో లాక్‌డౌన్ అవసరం లేదని సుప్రీం ధర్మాసనం తేల్చి చెప్పింది. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సుప్రం తలుపు తట్టింది. యూపీ ప్రభుత్వం వేసిన పిటిషన్ విచారించిన అనంతరం లాక్‌డౌన్ అవసరం లేదని తీర్పు చెప్పింది.సోమవారం అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ స్పందనా రాహిత్యాన్ని తప్పుపడుతూ, తక్షణ చర్యలు తీసుకోకపోతే వైద్య వ్యవస్థ కుప్పకూలుతుందని జస్టిస్ అజిత్ కుమార్, సిద్ధార్ధ వర్మలతో కూడిన డివిజన్ బెంచ్ వ్యాఖ్యానించింది. "ప్రభుత్వ ఆసుపత్రులలోని ఐసీయూల్లో చాలామటుకు వీఐపీల సిఫారసులతోనే పేషెంట్లను చేర్చుకుంటున్నట్టు మేము గుర్తించాం. రెమ్‌డిసివిర్ వంటి లైఫ్ సేవింగ్ యాంటీ వైరల్ డ్రగ్స్ సైతం వీఐపీల సిఫారసుతోనే ఇస్తున్నారు. చివరకు ముఖ్యమంత్రి సైతం లక్నోలో ఐసొలేషన్‌లో ఉన్నారు" అని న్యాయమూర్తులు తమ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అనంతరం ప్రయాగ్‌రాజ్, లక్నో, వారణాసి, కాన్పూర్ నగర్, గోరఖ్‌పూర్ నగరాల్లో లాక్‌డౌన్‌కు ఆదేశాలిచ్చింది.కాగా, హైకోర్టు ఆదేశాల్ని పాటించలేమని యోగి ప్రభుత్వం తేల్చి చెప్పింది. లాక్‌డౌన్ విధించ లేమని, కఠిన ఆంక్షలు అమలు చేస్తామని స్పష్టం చేసింది. అనంతరం హైకోర్టు ఆదేశాల్ని సవాల్ చేస్తూ యోగి ప్రభుత్వం సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసింది.

## ప్రజలందరికి శ్రీరామ నవమి శుభాకాంక్షలు: సీఎం జగన్

అమరావతి: శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలందరికి నవమి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ.. సీతారాముల కళ్యాణాన్ని ప్రజలు వేడుకగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. సీతారాముల, దీవెనలతో రాష్ట్ర ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అభిలషించారు. కరోనా విపత్తును ఎదుర్కొనే శక్తి ఇవ్వాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నానని వైఎస్ జగన్ అన్నారు.




# సంపాదకీయం

బుధవారం 21 ఏప్రిల్ 2021

## టీకాల సరఫరాలో లోపం ఎవరిది..

సెకండ్ వేవ్‌లో విపరీతంగా పెరుగుతున్న కరోనా కేసులతో తలపడేందుకు వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన తరుణంలో.. టీకాల ఉత్పత్తికి పెట్టుబడి విస్తరణ అవసరాన్ని తీర్చడంలో కేంద్రప్రభుత్వం నత్తనడక సాగిస్తోంది. దేశవ్యాప్తంగా వ్యాక్సిన్ తయారీ, సరఫరాపై నిర్ణయాధికారం ప్రధానంగా కొద్దిమంది ఉన్నతాధికారులకు కట్టబెట్టడంలోనే అసలు సమస్య దాగి ఉంది. మరోవైపు ప్రధాని మోదీ బిజినెస్ చేయడం బ్యూరోక్రాట్ల పని కాదని ధర్మపన్నాలు పలుకుతున్నారు. అదే సమయంలో వ్యాక్సిన్ల సేకరణ, పంపిణీ బిజినెస్‌ను పూర్తిగా కేంద్రీకరించేశారు. వ్యాక్సిన్ ప్లానింగ్ విషయంలో కేంద్రం స్పష్టంగా వైఫల్యం చెందిందనే చెప్పాలి. దేశవ్యాప్తంగా కోవిడ్?19 నిరోధక వ్యాక్సిన్ కొరత సంక్షోభం అలుముకుంటోందని వార్తలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో వ్యాక్సిన్ కొరత లేనేలేదని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తోసిపుచ్చుతోంది. పైగా అందుబాటులో ఉన్న టీకాల నిల్వను రాష్ట్ర ప్రభుత్వాలు సరిగా నిర్వహించడం లేదని కేంద్రం ఆరోపిస్తోంది. కానీ వాస్తవం ఏమిటంటే, అన్ని వ్యాక్సిన్‌ల కొనుగోలు, సరఫరాపై గుత్తాధిపత్యం వహిస్తున్న కేంద్రప్రభుత్వం.. 45 ఏళ్లకు పైబడిన వారికి అధిక సంఖ్యలో వ్యాక్సినేషన్ అందించే ప్రక్రియలో విఫలమైంది. ప్రస్తుతం దేశంలో తయారవుతున్న కోవి షీల్డ్, కోవాగ్జిన్ వ్యాక్సిన్‌ల మొత్తం ఉత్పత్తి సామర్థ్యం రోజుకు 24 లక్షలు మాత్రమే. కానీ, ఇప్పుడు రోజువారీ డిమాండ్ 37 లక్షలకు చేరుకుంది. అంటే రోజువారీ వేయాల్సిన వ్యాక్సిన్ టీకాల కొరత ఇప్పటికే చాలా ఎక్కువగా కనబడుతోంది. మార్చి నెలలో వ్యాక్సిన్ తీసుకోవడానికి ప్రజలు వెనుకాడటం, కొత్త ఇన్ఫెక్షన్ రేట్లు నియంత్రణలో ఉండటం కారణంగా వ్యాక్సిన్ సరఫరాలకు మించి డిమాండ్ ఏర్పడలేదు. కానీ ఏప్రిల్ 1 నుంచి వైరస్ వ్యాప్తి ఉన్నట్లుండి పెరిగిపోవడం, వ్యాక్సిన్ అర్హుల వయస్సును 45 ఏళ్లకు కుదించడంతో డిమాండ్ అనూహ్యంగా పెరిగిపోయింది. ఇప్పటికే ఉత్పత్తి సామర్థ్యం పెంపుదల సంభవించి ఉండాలి. కానీ దాని ప్లానింగ్ విషయంలో కేంద్రం స్పష్టంగా వైఫల్యం చెందింది. వ్యాక్సిన్ నిల్వలు తరిగిపోయిన తర్వాత రోజువారీ డిమాండ్?సప్లయ్ అంతరం రోజుకు 15 నుంచి 20 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ నేపథ్యంలో గురువారం రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్సులో ప్రధాని మోదీ టీకా ఉత్సవ్ గురించి మాట్లాడటం అధివాస్తవికమే అనిపిస్తోంది. చాలా రాష్ట్రాల వద్ద రెండు లేక మూడు రోజుల పాటు మాత్రమే వ్యాక్సిన్ సరఫరాలు ఉంటూండటమే. రాజకీయ కారణాల వల్ల మహారాష్ట్రలో వ్యాక్సిన్ కొరతపై తుపాను చెలరేగి ఉండవచ్చు కానీ ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు కూడా తమ వద్ద వ్యాక్సిన్ నిల్వలు హరించుకుపోతున్నాయని చెప్పాయి. ఏపీ, తెలంగాణల్లో జిల్లా స్థాయిలో ఇప్పటికే వ్యాక్సిన్ కొరత ఉంటోందని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ సహ యజమాని సంగీతా రెడ్డి చెప్పారు. కాగా సెకండ్ వేవ్ సమయంలో వైరస్ విపరీతంగా పెరుగుతున్న 2 టయర్, 3 టయర్ పట్టణాల్లోని ఆసుపత్రుల్లో, ఇతర గుర్తింపు పొందిన వైద్య కేంద్రాల్లో పొడవాటి క్యూలు కనిపిస్తున్నాయి. అంటే ఏప్రిల్ చివరి నాటికి దేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ వ్యాక్సిన్ కోటాను 50 శాతం మేరకు పెంచాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత వైరస్ వ్యాప్తి మే నెల మధ్య వరకు కొనసాగుతుందని నిపుణులు చెబుతుండటంతో వ్యాక్సిన్ డిమాండ్ మరింతగా పెరిగే అవకాశం కూడా ఉంది. పెరుగుతున్న డిమాండును ఎదుర్కోవడానికి వ్యాక్సిన్ ఉత్పత్తి చేస్తున్న రెండు సంస్థల ప్రస్తుత ఉత్పత్తి సామర్థ్యం సరిపోతుందా అనేది ప్రధాన ప్రశ్న. సీరమ్ సంస్థ ఉత్పత్తి చేస్తున్న కోవిషీల్డ్, భారత్ బయోటెక్ తయారు చేస్తున్న కోవాగ్జిన్‌ను ఎంత వేగంగా తయారు చేస్తారన్నదానిపైనే ప్రధాని ఆశిస్తున్న టీకా ఉత్సవ్ కార్యక్రమం ఆధారపడి ఉంది. ప్రస్తుతం దేశంలోని మొత్తం వ్యాక్సిన్ సరఫరాలో కోవిషీల్డ్ 90 శాతంగా ఉంది. సీరమ్ ఇనిస్టిట్యూట్ ఒక నెలలో 6 కోట్ల టీకాల సామర్థ్యం కలిగి ఉంది. నెలకు పది కోట్ల టీకాలను తయారు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం ధనసహాయం చేయాలని సీరమ్ సంస్థ ప్రమోటర్ అదార్ పూనవాలా స్పష్టం చేశారు. ప్రస్తుతానికైతే సీరమ్ సంస్థ నెలవారీగా తయారు చేస్తున్న ఆరు కోట్ల టీకాల తయారీ కూడా చేయడం సాధ్యం కాని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇక కోవాగ్జిన్ టీకాను తయారు చేస్తున్న భారత్ బయోటిక్ సంస్థ నెలకు కోటి డోసుల కంటే తక్కువ తయారీ సామర్థ్యంతో ఉంది. తన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి ఆర్థిక సహాయం చేయాలంటూ ఫిబ్రవరి నెలలోనే కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. కానీ ఆ అదనపు పెట్టుబడి అవసరాన్ని తీర్చేందుకు మన బడా బాబులు యథాప్రకారమే జాగు చేశారు. వాస్తవమేమిటంటే పెరుగుతున్న కరోనా కేసులతో తలపడేందుకు వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన తరుణంలో టీకాల ఉత్పత్తికి పెట్టుబడి విస్తరణ అవసరాన్ని తీర్చడంలో కేంద్రప్రభుత్వం నత్తనడక సాగిస్తోంది. ఎందుకంటే దేశవ్యాప్తంగా వ్యాక్సిన్ తయారీ, సరఫరాపై నిర్ణయాధికారం తీసుకునే అధికారాన్ని ప్రధానంగా కొద్దిమంది ఉన్నతాధికారులకు కట్టబెట్టడంలోనే అసలు సమస్య దాగి ఉంది. మరోవైపు ప్రధాని మోదీ బిజినెస్ చేయడం బ్యూరోక్రాట్ల పని కాదని ధర్మపన్నాలు పలుకుతున్నారు. అదే సమయంలో వ్యాక్సిన్ల సేకరణ, పంపిణీ బిజినెస్‌ను ప్రధానంగా పూర్తిగా కేంద్రీకరించేశారు. ప్రభుత్వమే వ్యాక్సిన్ల ఏకైక కొనుగోలుదారు కాబట్టి సామర్థ్య విస్తరణపై నిర్ణయాలను అది ప్రభావితం చేస్తోంది. దీన్ని ప్రైవేట్ రంగానికి వదిలిపెట్టి దానికి ధర విధించి, పేదలకు సబ్సిడీ కింద అందించి ఉంటే పరిణామా లు మరొక రకంగా ఉండేవి. ప్రస్తుతం పరిణామాలు విషమిస్తున్నప్పుడు మాత్రం పంపిణీ సమస్యలను రాష్ట్రాలపైకి నెట్టేస్తోంది. పైగా కేంద్రం వ్యాక్సిన్‌లను సేకరిస్తుంది తప్ప జిల్లా స్థాయిలో పంపిణీ బాధ్యత రాష్ట్రాలదే అని కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ చేతులెత్తేశారు. ప్రత్యేకించి ప్రతిపక్షాలు పాలిస్తున్న రాష్ట్రాలపై మంత్రి నిందమోపుతున్నారు.

# యడ్డీకి సొంత పార్టీ నుంచి సెగ



బెంగళూర్, ఏప్రిల్ 20, (న్యూస్ పల్స్) కర్ణాటక ముఖ్యమంత్రి యడ్యూరప్పకు సొంత పార్టీ నుంచి సెగ బాగానే తగులుతుంది. ఎందుకో ఈసారి యడ్యూరప్ప ముఖ్యమంత్రి పదవి చేపట్టిన ముహూర్తం బాగా లేనట్లుంది. పదవి చేపట్టిన నాటినుంచే అసమ్మతి గతంలో ఎన్నడూ చూడని విధంగా ఉండటం ఆశ్చర్యకరమే. అయితే కేంద్ర నాయకత్వం అండ లేకుండా అసమ్మతి నేతలు ఇంత బాహాటంగా వ్యవహరించరని యడ్యూరప్ప అనుమానంలో నిజం లేకపోలేదు. యడ్యూరప్ప కర్ణాటక బీజేపీలో బలమైన నేత. ఒకరకంగా చెప్పాలంటే దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ చోటు దక్కించుకుందంటే అది యడ్యూరప్ప పుణ్యమే. దానిని ఎవరూ కాదనలేరు. ఒకసారి బీజేపీ నుంచి విడిపోయి సొంత పార్టీ పెట్టుకున్నా తిరిగి పార్టీలోకి తీసుకున్నారంటే ఆయన నాయకత్వం ఏపాటిదో చెప్పకనే చెబుతుంది. కానీ గత అసెంబ్లీ ఎన్నికల్లో తృటిలో అధికారం కోల్పోయిన బీజేపీ 14 నెలల పాటు పవర్ కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. యడ్యూరప్ప వ్యూహాల కారణంగానే కర్ణాటకలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వచ్చిందనడంలో ఏమాత్రం సందేహం లేదు. అయితే కాంగ్రెస్ నుంచి వచ్చిన నేతలకు యడ్యూరప్ప ఇస్తున్న ప్రయారిటీ ఆయనకు పార్టీ లో ఇబ్బందికరంగా మారింది. తాను అధికారంలోకి రావడానికి కారణమైన వారిని ఎలా విస్మరిస్తామన్న యడ్యూరప్ప వాదనలోనూ నిజముంది. కానీ దానిని అంగీకరించేందుకు బీజేపీ నేతలు సిద్ధంగా లేరు. అందుకే మొన్న బసవగౌడ యత్నాల్, నేడు మంత్రి ఈశ్వరప్ప యడ్యూరప్పకు ఇబ్బందిగా మారారు. ఈశ్వరప్ప చిన్న సమస్యను పెద్దదిగా చేశారంటున్నారు. తనకు తెలియకుండా తన శాఖ పరిధిలోని నిధులను ముఖ్యమంత్రి కేటాయించడాన్ని ఈశ్వరప్ప తప్పుపడుతున్నారు. ఏకంగా గవర్నర్ కు ఫిర్యాదుచేశారు. యడ్యూరప్పను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పిస్తారన్న ప్రచారంతో అసమ్మతి మరింత పెరిగింది. మరి దీని నుంచి యడ్యూరప్ప ఎలా బయటపడతారో చూడాలి.

# బిజినెస్ సిటీగా శంషాబాద్


హైదరాబాద్, ఏప్రిల్ 20, (న్యూస్ పల్స్) శంషాబాద్‌కు అన్నీ కలిసివస్తున్నాయి. నగరంలో ఎక్కడాలేని విధంగా ఎయిర్‌పోర్టు, రైలు మార్గం, జాతీయ, అంతర్జాతీయ రోడ్లు ఉన్నాయి. వీటికి తోడు త్వరలోనే మెట్రో రైలు మార్గం సైతం అందుబాటులోకి రానున్నండటంతో ఎయిర్ పోర్టు పరిసరాల్లో అభివృద్ధి పరుగులు పెడుతున్నది. అన్నిరకాలుగా రవాణాసౌకర్యం ఉండటంతో జాతీయ, అంతర్జాతీయంగా పేరొందిన సంస్థలు వేల కోట్లు పెట్టుబడులు పెడుతున్నాయి. ఇవన్నీ అందుబాటులోకి వచ్చి కార్యకలాపాలు మొదలుపెడితే శంషాబాద్ మరో బిజినెస్ డిస్ట్రిక్‌గా మారనున్నది. ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలతో ఔటర్ రింగురోడ్డును నిర్మించిన హెచ్ఎండీఏ శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. శంషాబాద్ ఔటర్ రింగురోడ్డు ఇంటర్‌చేంజ్ సమీపంలో సుమారు 300లకు పైగా ఎకరాల్లో మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్టు హబ్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీనికి తోడు తెలంగాణ పరిశ్రమల శాఖ మహేశ్వరం, ఆదిభట్ల ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్ సిటీ, హార్డ్‌వేర్ పార్కు, శ్రీశైలం జాతీయ రహదారిపై ఫార్మాసిటీ, శంషాబాద్-షాబాద్ మార్గంలోని చందనవెల్లిలో మరో పారిశ్రామిక వాడ, బెంగళూరు జాతీయ రహదారిలోని కొత్తూరు, తిమ్మాపూర్, షాద్‌నగర్ ప్రాంతాల్లో పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేస్తున్నది. దీంతో శంషాబాద్ పరిసర ప్రాంతాలు భవిష్యత్‌లో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు కేంద్రంగా మారనున్నాయి. నగరానికి పడమర దిక్కున ఉన్న ఐటీ కారిడార్ శరవేగంగా విస్తరించడానికి గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ కీలకంగా మారింది. అదేతరహాలో దక్షిణ భాగంలో ఉన్న శంషాబాద్ ప్రాంతంలో సరికొత్త వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలను విస్తరించేందుకు మెండుగా అవకాశాలు ఉన్నాయి. ఔటర్ రింగు రోడ్డు పెట్టుబడులకు కేంద్రంగా మారింది. ముఖ్యంగా ఓఆర్ఆర్ చుట్టూ ఉన్న 19 ఇంటర్‌చేంజ్‌లు కేంద్రంగా హెచ్ఎండీఏ రకరకాల వ్యాపారాలకు అవకాశం కల్పిస్తూ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. ఇందులో ప్రధానంగా శంషాబాద్ ఓఆర్ఆర్ ఇంటర్‌చేంజ్ వద్ద సుమారు 300ఎకరాల్లో మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్టు హబ్ ఏర్పాటుకు హెచ్ఎండీఏ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అయితే సరుకు రవాణా రంగంలోనే కాకుండా ప్రజా రవాణా వ్యవస్థలో శంషాబాద్ ప్రాంతానికి ఎంతో ప్రాధాన్యత నెలకొంది. దీంతో ఈ ప్రాంతంలో రోడ్డు, రైలు, విమాన మార్గం మూడు ఒకే చోట కలిసి ఉండటంతో హెచ్ఎండీఏ మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్టు హబ్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్నది. శంషాబాద్‌కు కుడి, ఎడమలుగా రెండు డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు అమెజాన్ క్షేత్రస్థాయిలో పనులను ప్రారంభించింది. ఇప్పటికే చందన వెల్లి పారిశ్రామిక వాడలో సుమారు 500ఎకరాల్లో ఒక డేటా సెంటర్‌ను అమెజాన్ ఏర్పాటు చేస్తుండగా, అదేవిధంగా ఫార్మాసిటీ సమీపంలో మరో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం సుమారు రూ. 20వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు అమెజాన్ ప్రకటించింది. అయితే రోడ్డు, రైలు, విమానయాన మార్గాలు ఒకే చోట ఉండటంతో అటు ప్రభుత్వం, ఇటు ప్రైవేటు సంస్థలు లాజిస్టిక్ విభాగంలో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెడుతున్నాయి. ఇప్పటికే అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, డెలివరీ వంటి సంస్థలు సరుకు రవాణాకు సంబంధించి భారీ విస్తీర్ణంలో గోడౌన్‌లను నిర్మించి లాజిస్టిక్ సేవలను నిర్వహిస్తున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈవీ పాలసీ (ఎలక్ట్రిక్ వెహికిల్స్) లో భాగంగా మహేశ్వరం, చందనవెల్లిలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి ప్రత్యేకంగా ప్రోత్సాహకాలు ఇచ్చి పలు కంపెనీలు ఇక్కడ ఎలక్ట్రిక్ వాహనాలను తయారు చేసేలా ఒప్పందాలు చేసుకుంది. ఇందుకోసం వందలాది ఎకరాలను సిద్ధం చేసి, అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించింది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఒకవైపు హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి, మరో వైపు శ్రీశైలం హైవే ఉంది. ఈ రెండు జాతీయ రహదారుల వెంబడి పలు పారిశ్రామిక వాడలు ఉన్నాయి. వీటిలో తుక్కుగూడ, మహేశ్వరం వద్ద హార్డ్‌వేర్ పార్కు, ఈ సిటీ, కందుకూరు సమీపంలో ఫార్మాసిటీ, చందనవెల్లి, కొత్తూరు, తిమ్మాపూర్ వంటి పారిశ్రామిక వాడలు, ఇటీవల హైతాబాద్-చందనవెల్లి ప్రాంతంలో మరో పారిశ్రామిక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఈ పారిశ్రామిక వాడల్లో పలు కంపెనీలు తమ కార్యకలాపాలు ప్రారంభించగా, మరి కొన్ని కంపెనీల పనులు పురోగతిలో ఉన్నాయి.

# శ్రీరాముని తప్పేమీ లేదు

**శ్రీరాముణ్ణి వనవాసం కోసం సుమంత్రుడు రథంలో తీసుకొని వెళుతుండగా, దశరథ మహారాజు వెనుకనుంచి 'సుమంత్రా! ఆగు. ఇది నా ఆజ్ఞ' అంటాడు. దానికి శ్రీరాముడు 'వినపడలేదు'** అని చెప్పమంటాడు. ఇది ధర్మమేనా?

బ్రహ్మభట్ల ఆత్రేయ- మైత్రేయ శర్మ, సిద్దిపేట

వాల్మీకి రామాయణం ప్రకారం సుమంత్రుడు సారథిగా రాముడు అడవికి బయలుదేరగా, ఆ రథం వెంట పౌరులు, అంతఃపుర జనులతోసహా దశరథుడు, కౌసల్యాదులు పాదచారులై పరుగులు తీస్తూ, సోలిపోతూ..'ఓ సారథీ రథాన్ని ఆపు. లేదా నెమ్మదిగా పోనిమ్ము' అని హాహాకారాలు చేస్తుంటారు. దశరథుడు, కౌసల్యాదేవి 'హా! రామా, హా! సీతా, హా! లక్ష్మణా!' అని విలపించడం చూసి ద్రవించి పోయాడు శ్రీరాముడు. ఏనాడూ కాలు కింద పెట్టని తన తల్లిదండ్రులు, దుఃఖిస్తూ నేలపై నడిచి రావడం సూటిగా చూడలేని శ్రీరాముడు, 'రథాన్ని త్వరగా పోనిమ్మని' సారథిని తొందరించాడు. అప్పుడే దశరథుడు 'ఆగు మాగుము' అని గట్టిగా అరుస్తుండటం, శ్రీరాముడు 'పోనిమ్ము పోనిమ్ము..' అని తొందరించడం చూసిన సుమంత్రుని మనస్సు ముందు వెనుక చక్రాలమధ్య చిక్కుపడిన పురుషుని వలె సంకటస్థితికి లోనయిందంటాడు వాల్మీకి. సుమంత్రుని పరిస్థితిని గ్రహించిన శ్రీరాముడు, 'నీవు తిరిగి రాజువద్దకు వెళ్ళిన సమయంలో 'నా మాటను ఎందుకు వినలేదని' ఆయన అడిగితే, 'నేను వినలేదు' అని చెప్పమంటాడు. 'ఇంతటి దుఃఖస్థితిలో వున్నవారిని ఓదార్చడానికి ఇది సమయం కాదు' అని కారణమూ చెప్తాడుశ్రీరాముడు. ఇక్కడ ఒక విషయం గ్రహించాలి. 'నేను వినలేదు'అనడంలో 'నీ మాటను




వినలేదని కాదు, నీ ఆజ్ఞను పాటించలేదనీ' అర్థం. సుమంత్రుడు ఆ వేళ శ్రీరాముని సారథిగా ఆయన ఆజ్ఞను పాటించాడే కాని రాజాజ్ఞను పాటించలేదు. ఒకవేళ దశరథుడు దండించినా దానికి సన్నద్ధమయ్యే సుమంత్రుడు రథాన్ని త్వరగా పోనిచ్చాడు. దశరథుని వెంట వచ్చిన మంత్రులుకూడా రాజుని ఓదార్చుతూ, 'మహారాజా! ఆత్మీయులు తిరిగి మనలను చేరుకోవాలని కోరుకుంటారు. కాబట్టి, ఎక్కువ దూరం అనుసరింపరాదు' అనడం, దశరథుడు వెనుదిరగడం జరిగింది. ఇక్కడ ధర్మాధర్మ చర్చకన్నా అక్కడి పరిస్థితులకు అనుగుణంగా శ్రీరాముడు స్పందించాడు. 'తానెలాగూ వెళ్ళాలి. తల్లిదండ్రులను, ఆత్మీయులను ఎక్కువసేపు బాధ పెట్టేకన్నా త్వరగా అక్కడినుండి వెళ్ళిపోవడం మంచిది' అనే భావనతోనే శ్రీరాముడు అలా ప్రవర్తించినట్లుగా అర్థం చేసుకోవాలి.

# ముగ్గురు ఫ్యూచర్ ఏంటీ

చెన్నై, ఏప్రిల్ 20, తమిళనాడు ఎన్నికలు పూర్తయ్యాయి. అయితే తమిళనాడు ఎన్నికలు కొందరి రాజకీయ ఆశలు పూర్తిగా అడియాసలు చేశాయి. అనుకోని పరిణామాలు, ఊహించని ఘటనలు ముగ్గురి రాజకీయ భవిష్యత్ అంధకారంలో పడింది. వీరు ముగ్గురూ తమ రాజకీయ భవిష్యత్ కోసం మరో ఐదేళ్ల పాటు ఆగాల్సిందే. ఇప్పుడు తమిళనాడు అసెంబ్లీ ఎన్నిలకు పూర్తయిన తర్వాత ఈ ముగ్గురి గురించే ఎక్కువగా చర్చ జరుగుతోంది. రజనీకాంత్ ? ఈ అసెంబ్లీ ఎన్నికలలో రాజకీయ పార్టీ పెట్టాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు ఆయన చేసుకున్నారు. సభ్యత్వాలను చేర్పించారు. తాను అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించి అభిమానులను ఉత్సాహ పరిచారు. తమిళనాడులో లక్షల సంఖ్యలో ఉన్న రజనీకాంత్ అభిమానులు ఆయన పార్టీ ప్రకటన చేస్తారని అనుకున్నారు. కానీ ఊహించని విధంగా ఆయన ఆరోగ్యం దెబ్బతినడంతో రాజకీయ పార్టీ పెట్టే ఆలోచనను విరమించు కున్నారు. రాజకీయంగా తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలంటే మరో ఐదేళ్లు ఆగాల్సిందే. ఇక మరో నేత శశికళ. జయలలితకు అత్యంత సన్నిహితంగా ఉన్న శశికళ నాలుగున్నరేళ్ల పాటు అక్రమాస్తుల కేసులో జైలు శిక్ష అనుభవించారు. ఎన్నికలకు ముందే శశికళ విడుదలయ్యారు. తమిళనాడు రాజకీయాల్లో శశికళ ముఖ్య భూమిక పోషిస్తుందని భావించారు. జైలు నుంచి విడుదలయినప్పుడు భారీ స్వాగత ఏర్పాట్లు కూడా చేశారు. కానీ ఉన్నట్లుండి శశికళ రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటంచి తమిళనాడులోని ఆమె అభిమానులకు షాక్ ఇచ్చారు. శశికళ రాజకీయాల్లో రాణించాలంటే మరో ఐదేళ్లు ఆగాల్సిందే. మరో కీలక నేత ఆళగిరి. కరుణానిధి కుమారుడైన ఆళగిరి తండ్రి మరణం తర్వాత డీఎంకేలోకి వచ్చేందుకు ప్రయత్నించారు. కానీ స్టాలిన్ అంగీకరించకపోవడంతో రజనీకాంత్ పార్టీలో చేరాలనుకున్నారు. రజనీ కూడా వెనక్కు తగ్గడంతో తమిళనాడులో సొంత పార్టీ పెట్టాలని భావించారు. కానీ సాధ్యపడలేదు. ఆళగిరి ఏ రాజకీయ పార్టీ పెట్టకుండానే తమిళనాడు ఎన్నికలు ముగిశాయి. ఈ నేతలు మర ఐదేళ్ల పాటు రాజకీయాలకు దూరంగా ఉండాల్సిందే.

# కరోనా వుంటే పసి గడుతోంది



అనంతపురం (విశ్వం వాయిస్ న్యూస్) అనంతపురం జిల్లా గుంతకల్లు రైల్వే జంక్షన్లో కరోనా పరీక్షలను అధికారులు పటిష్టంగా నిర్వహిస్తున్నారు. జంక్షన్లోని ప్లాట్ఫారాల్లోకి ప్రయాణికులు ప్రవేశించే ప్రదేశంలో థర్మల్ స్క్రీనింగ్ చేసేందుకు సీసీ కెమెరాతోపాటు టీవీని ఏర్పాటు చేశారు. ప్రయాణికులు ప్రవేశద్వారం వద్దకు రాగానే కెమెరా వారి శరీర ఉష్ణోగ్రతను రికార్డుచేసి సమాచారాన్ని టీవీకి అందిస్తుంది. ఉష్ణోగ్రత ఎక్కువ ఉన్నట్లు నిర్ధారణ అయితే టీవీలో నుంచి శబ్దం వస్తుంది. అక్కడ విధులు నిర్వహించే టికెట్ చెకింగ్ సిబ్బంది అప్రమత్తమై సంబంధిత ప్రయాణికులు స్టేషన్లోకి వెళ్లకుండా వెనక్కి పంపించేస్తున్నారు. స్టేషన్లో శానిటైజర్ వేయాలని రైల్వే జనరల్ మేనేజరు గజానన్ మాల్య ఆదేశించడంతో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. అన్ని పరీక్షలు పూర్తయిన తర్వాతనే ప్రయాణికులు రైళ్లు ఎక్కేలా చూస్తున్నామని సిబ్బంది తెలిపారు. గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఆలోఖ్ తివారి మాట్లాడుతూ రైల్వే ప్రయాణికుల భద్రత కోసం థర్మల్ స్క్రి మిషన్ ఏర్పాటు చేశామని. రైల్వే ఉద్యోగస్తులను కారోనా నుండి కాపాడు డానికి తగు చర్యలను చేపడుతున్నామని రైల్వే ఉద్యోగులు సాధారణ ప్రజలు కూడా రైల్వే హాస్పిటల్ నందు కరోనా టీకా వేయించుకో వచ్చునని అన్నారు. హాస్పిటల్ చీఫ్ మెడికల్ సూపర్డెంట్ నాయక్ మాట్లాడుతూ కరోణ వచ్చిన భయపడాల్సిన అవసరం లేదని రైల్వే ఆసుపత్రిలో 40 పడగలను ఏర్పాటు చేశామని ఉద్యోగస్తులు అత్యవసరమైన సమయంలో వెంటనే రైల్వే హాస్పిటల్ లో వచ్చి చికిత్స తీసుకోవచ్చని అన్నారు.

# మినీపోరు కోసం కేసీఆర్ వ్యూహాలు

హైదరాబాద్, ఏప్రిల్ 20, (న్యూస్ పల్స్) తెలంగాణ మరో ఎన్నికల యుద్దానికి సిద్దమవుతున్నాయి ప్రధాన రాజకీయ పార్టీలు. ఇక ప్రతి ఎన్నికను గెలిచి తీరాలని కసితో పని చేస్తున్న అధికార టీఆర్ఎస్ మినీ మున్సిపల్ వార్ పై దృష్టిపెట్టింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో ఎన్నికల వ్యూహాన్ని సిద్ధం చేసింది అధికార పార్టీ. రెండు మునిసిపల్ కార్పొరేషన్లతో పాటు అయిదు మునిసిపాలిటీలకు జరుగుతున్న ఎన్నికల్లో పటిష్ట వ్యూహంతో విపక్షానికి చాన్స్ లేకుండా ప్రణాళిక సిద్ధం చేసింది. అభ్యర్ధి ఎంపిక మొదలు పోలింగ్ వరకు అన్ని తామై నిర్వహించేందుకు ఓ భారీ టీంని రంగంలోకి దింపనుంది. రాష్ట్రంలో రెండు మునిసిపల్ కార్పొరేషన్లతోపాటు అయిదు మునిసిపాలిటీలకు ఎన్నికల్లో నామినేషన్ల పర్వానికి తెరపడింది. ఏప్రిల్ 30న పోలింగ్ నిర్వహించి, మే మూడో తేదీన ఓట్ల లెక్కిపు చేపట్టి ఫలితాన్ని ప్రకటిస్తారు. కేసీఆదేశాలతో ఎన్నికల భాద్యతలు తీసుకున్న కేటీఆర్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు సీనియర్ నేతలకు ఈ ఎన్నికల బాధ్యతలను అప్పగించారు. వీరంతా పార్టీ వర్గాలతో కలిసి పని చేయాల్సి వుంటుంది. స్థానిక ఎన్నికలైనందున ఆయా జిల్లాల మంత్రుల ఆధ్వర్యంలోనే పార్టీ వర్గాలు పనిచేయాలని అధిష్ఠానం నిర్ణయించింది. వరంగల్‌కు మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎమ్మెల్యేలు.., ఖమ్మంలో మంత్రి పువ్వాడ అజయ్.. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు, సిద్దిపేటకు మంత్రి హరీశ్‌రావు, జడ్చర్ల, కొత్తూరు పురపాలికలకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్, అచ్చంపేటకు మంత్రి నిరంజన్‌రెడ్డి, నకిరేకల్‌కు మంత్రి జగదీశ్‌రెడ్డిలకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. కార్పొరేషన్లలో ఒక్కో డివిజన్ ఒక్కో ముఖ్యనేతను, పురపాలికల్లో ప్రతి మూడు, నాలుగు వార్డులకు ఓ ముఖ్య నాయకుడు ప్రచార బాధ్యతలు చేపడతారు. అభ్యర్థుల ఎంపిక బాధ్యతలను స్థానిక నేతలకే బాధ్యతలు అప్పగించారు వర్కింగ్ ప్రెసిడెంట్. పార్టీ వ్యూహానికి అనుగుణంగా వీరు స్థానిక పరిస్థితులకు తగ్గట్టుగా ప్రచారావ్యూహాన్ని సిద్దం చేసుకున్నారు. మినీ పోరు ప్రచారానికి మరో తొమ్మిది రోజుల సమయమే మిగిలి ఉంది. వరంగల్, ఖమ్మంలలో రెండేసి రోజులు కేటీఆర్ రోడ్‌షో లు నిర్వహించనున్నట్లు తెలుస్తుంది.

# పవన్ కు భారీ గిఫ్ట్....



తిరుపతి, ఏప్రిల్ 20, (న్యూస్ పల్స్) బీజేపీ ఏపీకి ప్రత్యేక హోదాని మడతేసి ప్రత్యేక ప్యాకేజి అని చెప్పిన నాడు జనసేనాని పవన్ కళ్యాణ్ అన్న మాట పాచిపోయిన లడ్డూలు ఏపీకి ఇస్తారా అని. ఆ తరువాత అదే పవన్ బీజేపీ పంచన చేరారు. ఇక ఇపుడు పవన్ అలకలను మెల్లగా తీరుస్తూ బీజేపీ మచ్చిక చేసుకుంటోంది. తిరుపతి లోక్ సభ ఉప ఎన్నికలకు ముందు పవన్ కళ్యాణ్ ను కాబోయే సీఎం గా ఏకంగా సోము వీర్రాజు ప్రకటించి సంచలనం రేపారు. పవన్ కళ్యాణ్ ను చాలా జాగ్రత్తగా గౌరవంగా చూసుకోమని బీజేపీ పెద్దలు తమకు చెప్పారని కూడా సోము చెప్పుకున్నారు. మొత్తానికి పవన్ అలక కొంత తీరి తిరుపతి ఎన్నికల ప్రచారానికి వచ్చి వెళ్లారు.బీజేపీకి తిరుపతి ఉప ఎన్నికల్లో గెలిచిపోదామని పెద్ద ఆశలు ఏవీ లేవు. కనీసం రెండున్నర లక్షల ఓట్లు అయినా పడితే అవే పది లక్షల ఓట్లు అనుకుంటోంది. ఎందుకంటే అన్ని ఓట్లు కనుక వస్తే వచ్చే ఎన్నికల నాటికి పునాది వేసుకోవచ్చు అన్నది బీజేపీ వ్యూహంగా ఉంది. ఇక ఈ ఓట్లను చూపించి ఏపీలో టీడీపీ పని అయిపోయింది అని అర్జంటుగా దండోరా వేస్తారు. వైసీపీ మీద వ్యతిరేకత దారుణంగా వచ్చేసిందని కూడా టముకు వేస్తారు. ఆ విధంగా పవన్ కళ్యాణ్ ని ముందు పెట్టుకుని ఏపీ రాజకీయాల్లో చక్రం తిప్పాలని బీజేపీ కోరిక. మరి పవన్ కళ్యాణ్ ప్రచారం చేశారు, జనాలు కూడా ఆ సభకు కుమ్మేశారు. దీని ఫలితం ఏమైనా ఉంటుందా అన్నదే ఇపుడు చర్చ.ఇక బీజేపీ కోరుకుంటున్నట్లుగా రెండు లక్షలకు పైగా ఓట్లు వచ్చి కమలం బుట్టలో చేరితే ఇక కాషాయ దళాన్ని ఏపీలో పట్టలేమని అంటున్నారు. కమలం పార్టీ కూడా పవన్ కళ్యాణ్ ని అసలు విడిచి పెట్టే ప్రసక్తే ఉండదని కూడా చెబుతున్నారు. ఇంత చేసిన పవన్ కి పెద్ద బహుమతే ఇస్తారని చెబుతున్నారు. పవన్ కి రాజ్యసభ సీటు ఇచ్చి అధికారిక హోదాను ఖరారు చేస్తారు అంటున్నారు. కేరళలో బీజేపీకి మద్దతుగా నిలిచిన సురేష్ గోపి అనే హీరోకి పెద్దల సభలో చోటిచ్చారు. ఆయన కంటే పవన్ కళ్యాణ్ ఏమి తక్కువ. అందుకే దక్షిణాదిన సినిమా నటుల గ్లామర్ తో పాతుకుపోవాలనుకుంటున్న బీజేపీ పవన్ని ఎంపీని చేస్తుంది అంటున్నారు.ఇక పవన్ కళ్యాణ్ తో సాన్నిహిత్యం మరింత కుదిరితే ఏపీ కోటాలో ఆయనని కేంద్ర మంత్రిని కూడా చేస్తారు అంటున్నారు. ఏపీలో బలమైన వైసీపీని ఎదుర్కోవాలంటే పవన్ కళ్యాణ్ కి కూడా అధికార పదవి ఉండాలని కూడా బీజేపీ పెద్దలు ఆలోచిస్తున్నారుట. అయితే ఇక్కడ మాత్రం షరతులు వర్తిస్తాయి అంటున్నారు. పవన్ కళ్యాణ్ తన జనసేన పార్టీని బీజేపీలో విలీనం చేస్తేనే ఆయనకు కేంద్ర మంత్రి పదవి ఇస్తారని చెబుతున్నారు. ఏపీలో జనసేన ఎంత గింజుకున్నా అయిదారు శాతం ఓట్లే వస్తున్నాయి. ఈ నేపధ్యంలో పవన్ కి కూడా ఈ ఒప్పందం నచ్చే అవకాశాలే ఎక్కువగా ఉంటాయని అంటున్నారు. మొత్తానికి పవన్ కి బీజేపీ భారీ గిఫ్ట్ నే రెడీ చేసి పెట్టిందని అంటున్నారు. ఇవన్నీ జరగాలంటే తిరుపతిలో బీజేపీకి లక్షల్లో ఓట్ల పంట పండాలిట. మరి అది జరిగితేనే ఇది కూడా జరుగుతుంది అంటున్నారు. మొత్తానికి ఈసారి పవన్ కోసం కమ్మని తిరుపతి లడ్డూలే సిద్ధంగా ఉ న్నాయన్నమాట.

# కమలానికి సోము కష్టాలు



రాజమండ్రి, ఏప్రిల్ 20, (న్యూస్ పల్స్) ఏపీలో రాజకీయ ప్రయోగాలు ఇంకా చేసేందుకే బీజేపీ రెడీ అయినట్లుగా కనిపిస్తోంది. రోగం ఎక్కడ ఉ ందో తెలుసు. మందు మాత్రం అక్కడ వేయకుండా బీజేపీ పడుతున్న పాట్లు ప్రత్యర్ధులకు నవ్వు పుట్టిస్తున్నాయి. కానీ ఆ పార్టీ పెద్దలు మాత్రం తమ పార్టీ తమ ప్రయోగాలు అన్న తీరునే ముందుకు సాగిపోతున్నారు. ఏపీలో కాపులు ఎక్కువగా ఉన్నారని కన్నా లక్ష్మీనారాయణని తెచ్చి అర్జంట్ గా ప్రెసిడెంట్ చేశారు. అటు కాంగ్రెస్ కాపులు ఇటు టీడీపీ కాపులు అందరూ ఎగబడతారు అని భావించారు. కానీ అంచనాలు తల్లకిందులు అయ్యాయి.ఇక బీజేపీని అట్టిపెట్టుకుని సుదీర్ఘకాలంగా ఉన్న కార్యకర్త, ఆర్ఎస్ఎస్ నేపధ్యం ఉన్న సోము వీర్రాజు నెత్తిన కమల కిరీటం పెట్టారు. అయితే సోము వీర్రాజు ఏలుబడిలో గతంలో ఎన్నడూ లేని విధంగా బీజేపీ ప్రతిష్ట ఇంకా దారుణంగా పతనం అవుతోందిట. ఈ మేరకు వచ్చిన సర్వే నివేదికలు చూసి బెంబేలెత్తుతున్న కేంద్ర నాయకత్వం తొందరలోనే సోము వీర్రాజుని మాజీని చేసి కొత్త వారిని పీఠమెక్కించాలని చూస్తోందని టాక్. సోము వీర్రాజుకు మెగా హీరోలతో ఉన్న పరిచయాలు, కాపు కార్డు కలసివస్తాయని భావిస్తే అది కూడా బెడిసికొట్టిందని కాషాయం పెద్దలు ఒక అంచనాకు వచ్చేశారుట.ఇక బీజేపీకి రాయలసీమ మీద ఇపుడు హఠాత్తుగా మోజు పెరిగింది. ఇంతకాలం కోస్తా బెల్ట్ ని పట్టుకుని ఓట్ల కోసం చేసిన ఫీట్లు అచ్చిరాలేదని అనుకున్నారో ఏమో కానీ బలమైన నేతకు అధ్యక్ష పదవి అప్పగించాని భావిస్తున్నారుట. ఇక ఏపీలో జగన్ అపరిమిత శక్తిమంతుడిగా మారిపోతున్న నేపధ్యంలో ఆయన్ని ఢీ కొట్టాలంటే సొంత సామాజికవర్గం నుంచే ప్రెసిడెంట్ ని చేయాలని ఆలోచిస్తున్నారుట. ఇక జగన్ సొంత జిల్లా అయితే మరీ మేలు అనుకుని మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డికి పగ్గాలు అప్పగించడానికి రెడీ అవుతున్నారని అంటున్నారు. ఆదినారాయణరెడ్డి తన సొంత ఇలాకాలో పొలిటికల్ గా కొంత పట్టు నిలుపుకున్నారు. పంచాయతీ ఎన్నికల్లో ఫలితాలను కూడా చూపించారు.బీజేపీ దాదాపు మూడేళ్ళుగా ఎన్నో ప్రయోగాలు చేస్తోంది. కానీ కలసిరావడంలేదు. దానికి కారణం ఏపీ బీజేపీ నేతలు అనుకుంటోంది. కానీ ఏపీ జనాలు బీజేపీ మీద నమ్మకం పెంచుకోవాలంటే తాను కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీగా ఏం చేయాలో బీజేపీ మరచిపోయిందని అంటున్నారు. ఇక ఆదినారాయణరెడ్డికి పట్టం కడితే ఆయన జగన్ కి బద్ధ శత్రువు కాబట్టి ఏమైనా ప్రయోజనం ఉంటుందని ఆశిస్తున్నారు. అదే సమయంలో ఆదినారాయణరెడ్డి చంద్రబాబు మంత్రివర్గంలో పనిచేశారు. ఆ విధంగా బాబుతో చెలిమికి బీజేపీ ట్రై చేస్తుందా అన్న చర్చ కూడా వస్తోంది. మొత్తానికి చూస్తే సోము వీర్రాజుకు పదవీగండం పొంచి ఉంది అన్న మాట గట్టిగానే ఉంది మరి.

# యువకుల వీరంగం.. ఆసుపత్రి అద్దాలు ధ్వంసం

నూజివీడు కృష్ణాజిల్లా నూజివీడు పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర యువకులు వీరంగం సృష్టించారు. పది మంది యువకులు ఒకరిపై ఒకరు కర్రలు,ఇనుపరాడ్లతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటన లో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రిలోకి చొరబడిన ఒక వర్గం యువకులపై మరోవర్గం దాడి జరిపింది. రెండు వర్గాల దాడిలో ప్రభుత్వ ఆసుపత్రి అద్దాలు, గేట్లను ధ్వంసం అయ్యాయి.

# జగన్ ను బెయిల్ రద్దు చేసే పరిస్థితి ఉందా

విజయవాడ, ఏప్రిల్ 20, (న్యూస్ పల్స్) జగన్ ఏపీ సీఎం. అంతకంటే కూడా ఏపీలో ఒక బలమైన ప్రాంతీయ పార్టీకి అధినేత. ఆయన ముఖ్యమంత్రి కాక ముందే నానా కష్టాలు పడి రాటుదేలిన నేత. ఆయనకు కేసులు, అరెస్టులు, జైళ్ళు అంటే భయం అని ఎవరైనా అనుకుంటే పొరపాటే. జగన్ దూకుడుగా రాజకీయాలు చేస్తాడు. అటువంటి జగన్ ని జైలు పేరు మీదో బెయిల్ రద్దు అంటూనే బెదిరిస్తే అసలు లొంగుతారా. ఇది జన సామాన్యంలో ఉన్న చర్చనే. దాన్నే మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ కూడా ప్రస్థావిస్తున్నారు.జగన్ బెయిల్ రద్దు చేసి అరెస్ట్ చేసి జైలులో పెట్టాలని కేంద్ర పెద్దలు ఆలోచన కనుక చేస్తే అది దుస్సాహమే అవుతుందని ఉ ండవల్లి అంటున్నారు. వారు అలాంటి పనికి ఒడిగడతారు అని తాను అనుకోవడంలేదని కూడా ఉండవల్లి చెబుతున్నారు. జగన్ విషయంలో ఏపీ బీజేపీ నేతలు చేస్తున్న ప్రకటనలు పెద్ద సీరియస్ గా తీసుకోవాల్సింది లేదన్నదే ఉండవల్లి అభిప్రాయంగా ఉంది. ఒకవేళ కేంద్ర పెద్దలు కూడా అలాగే ఆలోచన చేస్తే మాత్రం అది జగన్ కే మేలు అంటున్నారు ఉండవల్లి.జగన్ కి జైలు కొత్త కాదు అని ఉండవల్లి చెబుతూ అక్కడ నుంచే పాలించగల సమర్ధుడు జగన్ అని అంటున్నారు. జగన్ విషయంలో బీజేపీ నేతలకు ఏ రకమైన అప్షన్లు లేకపోతేనే అరెస్ట్ దాకా వస్తారేమో అన్న అనుమానాన్ని ఆయన వ్యక్తం చేస్తున్నారు. ఇక జగన్ ఏపీ ప్రయోజనాల గురించి గొంతు ఎత్తాల్సిన సమయం ఇదేనని కూడా ఉండవల్లి సూచిస్తున్నారు. జగన్ సైతం దేనికీ భయపడే రకం కాదని ఆయన విశ్లేషిస్తున్నారు. జగన్ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ సహా ఏపీకి సంబంధించి ప్రతీ దాని మీద నిలదీసి కేంద్రంతో తేల్చుకోవాలని కూడా ఉండవల్లి సూచిస్తున్నారు.బీజేపీ పెద్దలను ఢీ కొడితేనే ఎవరికైనా మనుగడ అని కూడా ఉండవల్లి లాంటి మాట. బీజేపీ పెద్దల వ్యవహారం పరిగెడితేనే వెంటబెట్టేలా ఉంటుందని కూడా చెబుతున్నారు. మరి ఉండవల్లి సలహాలు బాగానే ఉన్నాయి కానీ జగన్ కి కూడా ఇలాంటి విషయాల్లో తనదైన ఆలోచన, విశ్లేషణ ఉంటాయని కూడా వైసీపీ నేతలు అంటున్న మాట. జగన్ ఎందుకు సైలెంట్ గా ఉన్నారు అన్నది కూడా ఇక్కడ ఆలోచన చేయాలి. జైలుకు వెళ్ళి మళ్ళీ కటకటాల నడుమ గడపడం జగన్ కి అభ్యంతరం కాకపోవచ్చు. అదే సమయంలో మిగిలిన విషయాలను కూడా ఆయన పరిగణంలోకి తీసుకునే సహనంగా ఉంటున్నారు అన్నది వైసీపీ నేతల మాట. తాను ఆవేశపడితే రాష్ట్ర మరింతగా నష్టపోకూడదన్నదే జగన్ ఆలోచన అని వారు చెబుతున్నారు. మొత్తానికి జగన్ విషయంలో బీజేపీ అడుగు ముందుకు వేస్తుందా జగనే ఢీ కొడతారా అనంది ఫ్యూచర్ పాలిటిక్స్ లో చూడాల్సిందే.

# రాజభవన్ కు జగన్ కు మధ్య గ్యాప్..?

విజయవాడ, ఏప్రిల్ 20, (న్యూస్ పల్స్) ఏపీలో రాజకీయ ఆపరేషన్ చేపట్టడానికి బీజేపీ రెడీ అవుతున్నట్లుగా ఉంది. ఏపీలో జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చి రెండేళ్ళు దగ్గర పడుతోంది. కేంద్రంలో మోడీ కూడా రెండవసారి అధికారంలోకి వచ్చి రెండేళ్ళు అవుతోంది. బీజేపీ వైసీపీల మధ్య పొలిటికల్ హనీమూన్ దాదాపుగా ముగిసింది అని కూడా అంటున్నారు. ఎవరు ఎవరికి ఎంతవరకూ ఉపయోగపడతారు, ఎంతవరకూ ప్రతికూలమవుతారు అన్న దాని మీద కూడా పూర్తిగా స్పష్టత వచ్చింది. దాంతో ఏపీ విషయంలో బీజేపీ తనదైన ఆలోచన చేయనుంది అంటున్నారు.ఏపీకి కేంద్రం ఏం చేసింది అని చాలా మంది ప్రశ్నిస్తారు కానీ రాజకీయంగా జగన్ పాలన సాఫీగా సాగడానికి తెర వెనక నుంచి మద్దతు బాగానే ఇచ్చింది. జగన్ తో ఇచ్చిపుచ్చుకునే ధోరణితో ఉండడం వల్లనే బీజేపీ ఈ రకంగా వ్యవహరించింది అని చెప్పాలి. ముఖ్యంగా రాజ్యాంగ సంస్థలతో జగన్ కి పెద్దగా పేచీలు రాలేదు. ఒక వేళ ఎక్కడైనా వచ్చినా స్మూత్ గా డీల్ చేసుకునేలా కేంద్రంలోని బీజేపీ పెద్దలు ఆసరా ఇచ్చారు. ఇకపైన కారాలూ మిరియాలే తప్ప సహకారాలు అన్నవి అసలు ఉండవని అంటున్నారు.ఇక ఏపీ విషయానికి వస్తే గవర్నర్ జగన్ సర్కార్ కి పూర్తి స్థాయిలో సహకరిస్తున్నారు. జగన్ సర్కార్ ఏ బిల్లు పంపినా కూడా ఆయన ఆమోదముద్ర వేస్తున్నారు. ప్రభుత్వానికి ఆయన తన వంతుగా అండగా ఉంటున్నారు. గత ఏడాది మూడు రాజధానుల బిల్లుని పంపితే గవర్నర్ దాని మీద కూడా ఆమోదముద్ర వేశారు. అలాగే బీజేపీ సహా విపక్షాలు వ్యతిరేకించే అనేక బిల్లులకు గవర్నర్ సంతకం పెట్టి వైసీపీకి ఏ చిక్కులూ లేకుండా చేశారు. ఇపుడు అలాంటి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ని తప్పిస్తారు అన్న ప్రచారం అయితే గట్టిగా సాగుతోంది.తెలంగాణాలో బీజేపీలో క్రియాశీలంగా ఉన్న తమిళ్ సై ని గవర్నర్ గా కేంద్రం నియమించింది. ఆమె చురుకైన పోకడలతో కేసీయార్ సర్కార్ అక్కడ ఇబ్బందులు పడుతున్న సంగతి విదితమే. గవర్నర్ ప్రతీ విషయం మీద ఆరా తీయడం సొంతంగా నివేదికలు తెప్పించుకోవడం వంటివి చేస్తూ కేసీయార్ సర్కార్ కి చెక్ పాయింట్ గా వ్యవహరిస్తున్నారు. సరిగ్గా అలాంటి గవర్నర్ నే ఏపీకి కూడా తేవాలని కేంద్ర పెద్దలు ఆలోచిస్తున్నారు అంటున్నారు. ప్రస్తుత గవర్నర్ వయోభారంతో ఉండడం వల్ల కూడా చురుకుగా వ్యవహరించలేకపోతున్నారు అన్న భావన ఉందిట. దాంతో కరడుకట్టిన బీజేపీ నేతను ఏపీ రాజ్ భవన్ లో పెట్టడం ద్వారా జగన్ దూకుడు కి చెక్ చెప్పాలని కేంద్ర బీజేపీ పెద్దలు సమాలోచనలు చేస్తున్నట్లుగా భోగట్టా. అదే జరిగితే జగన్ కి కొత్త చిక్కులు మొదలైనట్లే.

# కేసీఆర్ ఆరోగ్యం కోసం ప్రార్ధించాను

తిరుమల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్యం కుదుట పడాలని, త్వరగా కోలుకోవాలని శ్రీవారిని ప్రార్థించానని టిటిడి మాజీ జెఇఓ శ్రీనివాసరాజు అన్నారు. రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉ ండాలని ఆ దేవదేవుని ప్రార్థించాను. సరిగ్గా పది సంవత్సరాల క్రితం శ్రీవారికి ప్రత్యక్ష సేవచేసేమహద్భాగ్యం తిరుమల జాయింట్ ఎగ్జిక్యూటివ్ గా నాకు కలిగింది.శ్రీవారికిసేవచేయడంలో జీవితం లో సార్ధకత చేకూరింది. మరో సారి స్వామివారికి కృతజ్ఞతలు తెలియజేయడానికి దర్శనానికి వచ్చానని అన్నారు.

# రొయ్యల కోసం క్వారంటైన్

విశాఖపట్టణం, ఏప్రిల్ 20, (న్యూస్ పల్స్) కరోనా రోగుల కోసం క్వారంటైన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం వినే ఉంటారు. అందులో ఎలాంటి వింత లేదు. కానీ, రొయ్యల కోసం క్వారంటైన్ కేంద్రం.. గురించి విన్నారా. లేదు కదూ. రొయ్యలకు క్వారంటైన్ కేంద్రం ఏంటి? అని విస్తుపోతున్నారు కదూ. అవును, ఏపీలో రొయ్యల కోసం క్వారంటైన్ కేంద్రం ఏర్పాటు కాబోతుంది.జిల్లా నక్కపల్లి మండలం బంగారమ్మపేట దగ్గర ఆక్వాటిక్ క్వారంటైన్ ఫెసిలిటీ సెంటర్ కోసం రంగం సిద్ధమైంది. 2023 నాటికి ఈ కేంద్రం సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రొయ్యల సాగు చేపట్టాలంటే నాణ్యమైన సీడ్ (రొయ్య పిల్ల) చాలా ముఖ్యం. నాణ్యమైన సీడ్ కావాలంటే జన్యుపరమైన సమస్యలు, రోగాల్లేని బ్రూడర్స్ (తల్లి రొయ్యలు) అవసరం. ఆర్గనైజేషన్ ఫర్ ఇంటర్నేషనల్ ఎపిడ్యూజిస్ (ఓఐఈ) గుర్తించిన 8 రకాల వ్యాధులు బ్రూడర్స్ ద్వారా వాటి సంతతికి సంక్రమించవని నిర్ధారించేందుకు నిర్వహించే పరీక్షల్లో నెగిటివ్ అని వస్తేనే బ్రూడర్సను సీడ్ ఉత్పత్తికి అనుమతిస్తారు.యానిమల్ ఇంపోర్ట్ యాక్ట్–1898 ప్రకారం విదేశాల నుంచి ఏ రకం లైవ్ స్టాక్ (జీవాల)ను దిగుమతి చేసుకున్నా.. వాటి ద్వారా వాటి సంతతికి, మానవాళి సహా ఇతర జీవ రాశులకు ఎలాంటి రోగాలు సోకవని నిర్ధారించుకునేందుకు వాటిని క్వారంటైన్ చేయాల్సిందే. అదే విధంగా విదేశాల నుంచి దిగుమతి చేసుకునే తల్లి రొయ్యలను కూడా క్వారంటైన్లో ఉంచి పరీక్షిస్తారు. ఇలా పరీక్షించేందుకు ఇప్పటివరకు దేశవ్యాప్తంగా చెన్నైలో మాత్రమే ఆక్వా క్వారంటైన్ ఫెసిలిటీ సెంటర్ ఉంది.దీన్ని మెరైన్ ప్రోడక్స్ ఎక్స్పోర్ట్ డెవలప్మెంట్ అథారిటీ (ఎంపెడా), రాజీవ్‌గాంధీ సెంటర్ ఫర్ ఆక్వా కల్చరిక్స్ (ఆర్జీసీఏ) నిర్వహిస్తున్నాయి. ఏపీతో సహా దేశంలోని ఆక్వా హేచరీలన్నీ ఈ కేంద్రానికి క్యూ కట్టాల్సిందే. ఇక్కడ 400 తల్లి రొయ్యలను ఒక క్యారంటైన్ క్యూబికల్‌లో ఉంచి ఐదారురోజుల పాటు వివిధ రకాల పరీక్షలు నిర్వహిస్తారు. ఒక క్వారంటైన్ క్యూబికల్‌కి డిమాండ్‌ను బట్టి రూ.95 వేల నుంచి రూ.1.25 లక్షల వరకు వసూలు చేస్తారు.రొయ్య పిల్లల్ని ఉత్పత్తి చేసే హేచరీలు దేశవ్యాప్తంగా మొత్తం 560 ఉంటే.. వాటిలో 389 హేచరీలు ఒక్క ఏపీలోనే ఉన్నాయి. ఇక్కడ ఏటా 65 వేల మిలియన్ల సీడ్ ఉత్పత్తి అవుతోంది. ఇందుకోసం ఏటా సింగపూర్, హవాయ్, ఫ్లోరిడా తదితర ప్రాంతాల నుంచి 1.50 లక్షల బ్రూడర్సను హేచరీలు దిగుమతి చేసుకుంటాయి. వీటిని క్వారంటైన్ చేసేందుకు ఏటా రూ.కోట్లలో ఖర్చు చేస్తుంటారు.దేశం మొత్తమ్మీద ఒకే ఒక్క క్వారంటైన్ కేంద్రం ఉండటంతో సకాలంలో క్వారంటైన్ పూర్తి కాక, సీజన్‌కు నాణ్యమైన సీడ్ ఉత్పత్తి చేయలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు అదును దాటిపోతుందన్న ఆందోళనతో నాసిరకం సీడ్‌పై ఆధారపడి ఆక్వా రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారు. ఈ పరిస్థితికి చెక్ పెట్టేందుకు విశాఖ జిల్లా నక్కపల్లి మండలం బంగారమ్మపేట దగ్గర ఆక్వాటిక్ క్వారంటైన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం 30 ఎకరాలను సేకరించారు. దీని నిర్మాణానికి రూ.36.55 కోట్లను కేటాయించి ఇటీవలే టెండర్లు ఖరారు చేశారు. దీనిని 2023 నాటికి అందుబాటులోకి తీసుకురానున్నారు.నాణ్యమైన సీడ్ ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. దేశంలో ఇది రెండో క్వారంటైన్ కేంద్రం. ఏడాదికి 1,23,750 బ్రూడర్సను పరీక్షించే సామర్థ్యం ఈ కేంద్రానికి ఉంటుంది. ఒకేసారి 625 తల్లి రొయ్యలను పరీక్షించవచ్చు. వీటి ద్వారా 10 బిలియన్ల సీడ్‌ను ఉత్పత్తి చేయొచ్చు. ఆక్వా సాగు విస్తరణకు ఈ కేంద్రం ఎంతగానో దోహదపడుతుంది.

# ఐసీఎస్ఈ పదవ తరగతి బోర్డు పరీక్షలను రద్దు

న్యూఢిల్లీ ఏప్రిల్ 20 ఐసీఎస్ఈ పదవ తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేశారు. ఇండియన్ స్కూల్ సర్టిఫికేట్ ఎగ్జామినేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఈ విషయాన్ని ఓ ప్రకటనలో తెలిపారు. కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 12వ తరగతి బోర్డు పరీక్షలను మాత్రం ఆఫ్‌లైన్‌లో నిర్వహించనున్నారు. అయితే ఆ పరీక్షల తేదీలను తర్వాత ప్రకటిస్తారు. జూన్‌లో నిర్వహించే సమీక్ష తర్వాత ఈ నిర్ణయం తీసుకోనున్నారు. ఏప్రిల్ 16వ తేదీన జారీ చేసిన సర్క్యులర్‌ను ఉపసంహరిస్తున్నట్లు బోర్డు పేర్కొన్నది. విద్యార్థులు, టీచింగ్ స్టాఫ్ ఆరోగ్యం కీలకమైందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఐసీఎస్ఈ చెప్పింది.

## జానారెడ్డికే అవకాశాలు ఎక్కువట

నల్గొండ, ఏప్రిల్ 20, (న్యూస్ పల్స్) నాగార్జున సాగర్ ఎన్నిక పూర్తయింది. ఇక ఫలితాల కోసం ఎదురు చూడాల్సిందే. సాగర్ ఉప ఎన్నిక రెండు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా మారింది. తిరుపతి కన్నా సాగర్ మీదనే అందరి దృష్టి ఉ ంది. తిరుపతి ఉప ఎన్నికలో వైసీపీ విజయం ముందుగానే ఖాయమయి పోవడంతో దానిపై పదే?దగా ఉత్కంఠ లేదు. ఎవరికి అంతుపట్టకుండా ఉ ంది.నాగార్జున సాగర్ ఉప ఎన్నికల్లో తాము ఖచ్చితంగా గెలుస్తామని టీఆర్ఎస్ ఆశలు పెట్టుకుంది. కేసీఆర్ స్వయంగా సాగర్ ఉప ఎన్నికను పర్యవేక్షించారు. నిత్యం నేతలతో ఫోన్ లో మాట్లాడుతూ వారికి వ్యూహాలను అందించారు. నోముల భగత్ ను గెలిపించేందుకు మంత్రులు రంగంలోకి దిగారు. పెద్దయెత్తున హామీలు గుప్పించారు. దుబ్బాక ఫలితం రిపీట్ కాకుండా ఉ ండేందుకు ఈసారి కేసీఆర్ అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.నాగార్జున సాగర్ లో కాంగ్రెస్ అభ్యర్థి జానారెడ్డి శక్తికి మించి కష్టపడ్డారు. ఆయన దాదాపు మూడు నెలల నుంచి ప్రచారం నిర్వహిస్తూనే ఉన్నారు. తనకు ఇవే చివరి ఎన్నికలంటూ జానారెడ్డి సానుభూతిని పొందేందుకు ప్రయత్నించారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని కూడా చెప్పారు. రెడ్డి సామాజికవర్గం ఓట్లు ఎక్కువగా ఉండటంతో ఈసారి తన గెలుపు ఖాయమని జానారెడ్డి గట్టిగా విశ్వసిస్తున్నారు.భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా లంబాడా సామాజికవర్గానికి చెందిన డాక్టర్ రవికుమార్ పోటీ చేశారు. అయితే నాగార్జున సాగర్ లో బీజేపీ పెద్దగా ప్రభావం చూపే అవకాశం లేదు. ఆ సామాజికవర్గం ఓట్లపైనే బీజేపీ ఆశలు పెట్టుకుంది. రవికుమార్ జానారెడ్డి శిష్యుడే కావడం గమనార్హం. అయితే నాగార్జున సాగర్ ల ల మధ్యనే ఉంది. విజయావకాశాలు ఈ ఇద్దరిలో ఎవరికైనా దక్కే ఛాన్స్ ఉంది. జానారెడ్డికే ఎక్కువ అవకాశాలున్నాయని చెబుతున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# సెకండ్ వేవ్ లో దోపిడీ

విజయవాడ, ఏప్రిల్ 20, (న్యూస్ పల్స్) సెకండ్ వేవ్ లో కరోనా కరాళ నృత్యం మొదలు పెట్టింది. అంతకుమించి ప్రయివేట్ ఆసుపత్రుల దందా తారాస్థాయికి చేరింది. అడ్డు అదుపు లేని రీతిలో ప్రైవేట్ ఆసుపత్రులు సాగిస్తున్న వ్యాపారంపై అటు కేంద్ర ప్రభుత్వం కానీ ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ఏమి చేయలేని పరిస్థితి ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది. కరోనా సోకి రోగి ప్రాణాలు పోయినా పోకపోయినా ఆసుపత్రుల బిల్లులు చూస్తే గుండెలు ఆగే పరిస్థితి తెలుగు రాష్ట్రాల్లో కనిపిస్తుంది. ఈ వ్యవహారాలు కళ్ళకు కట్టినట్లు అందరికి తెలిసినా సర్కార్ మాటల్లో చెబుతున్న హెచ్చరికలు చేతల్లో మాత్రం లేకపోవడం తీవ్ర విమర్శలకు తెరతీస్తోంది.ప్రస్తుతం కరోనా వైద్యంలో కీలక సమయంలో రెమ్ డెసివర్ సంజీవనిగా పనిచేస్తుంది. దాంతో ఈ మందు పై కేంద్రం ఎన్ని నియంత్రణలు చేస్తున్నా బ్లాక్ మార్కెట్ లోనే తప్ప సాధారణంగా లభ్యం కావడం లేదు. డిమాండ్ కి తగ్గ ఉత్పత్తి లేకపోవడంతో ఏడు కంపెనీలకు అనుమతులను కేంద్రం ఇచ్చినా ఫలితం కనిపించడం లేదు. ఫస్ట్ వేవ్ లో 20 వేల నుంచి 35 వేలరూపాయల వరకు బ్లాక్ లో ఉండగా ఇప్పుడు కూడా అదే తీరులో లభించడం గమనార్హం. దాంతో ప్రభుత్వం చెబుతున్న మాటలకు వాస్తవంగా మార్కెట్ లో లభిస్తున్న రేటు కు పొంతన లేకుండా పోయింది. కంపెనీ ని బట్టి మూడు వేల రూపాయలనుంచి ఏడు వేలరూపాయల లోపు మాత్రమే ఈ మందును విక్రయించాలిసి ఉంది. ఒక రోగికి సుమారు ఆరు ఇంజెక్షన్ లను కోర్స్ గా వినియోగిస్తున్నారు. దాంతో బ్లాక్ లో కొనుగోలు చేసేవారు ఈ ఒక్క ముందుకే లక్ష రూపాయలకు పైగా వెచ్చించాలిసి వస్తుంది.మూడు రోజుల ప్యాకేజీ, ఐదు రోజుల ప్యాకేజీ, పది రోజుల ప్యాకేజీ 14 రోజుల ప్యాకేజీ అంటూ రెండు లక్షల రూపాయల నుంచి మొదలు అవుతుంది. ఒక్కో ఆసుపత్రి ఒక్కో రకమైన ఫీజులు నిర్ధారిస్తున్నాయి. రోజుకు కనీసం 50 నుంచి 90 వేలరూపాయలు పీకేస్తున్నారంటే ప్రైవేట్ ఆసుపత్రులు దందా ఎంత దారుణంగా ఉందొ చెప్పొచ్చు. ఇలా ప్రైవేట్ ఆసుపత్రులు కరోనా రోగులకు ఆఫర్లు పెట్టి లక్షల రూపాయలను గుంజుతున్నాయి. దాంతో పేషేంట్ బయటకు వచ్చేటప్పటికి వారి కుటుంబం ఆర్ధికంగా అప్పులపాలు కావాలిసి వస్తుంది. వాస్తవానికి ప్రభుత్వం ప్రకటించిన విధంగా అయితే




ప్రైవేట్ ఆసుపత్రులు రోజుకు ఒక పేషంట్ దగ్గర 3250 రూపాయలు మాత్రమే వసూలు చేయాలి. రోగి కి ఐసియు చికిత్స జరపాలిసి వస్తే 5480 రూపాయలు, వెంటిలేటర్ పై ఉంచితే రోజుకు 10380 రూపాయలు, రూమ్ ఛార్జ్ గా 600 రూపాయలు పీపీఈ కిట్లు వైరస్ నిర్ధారణ కిట్లకు అదనపు ధరలను వసూలు చేయొచ్చు కానీ ఈ ధరలను ఏ ఆసుపత్రి అమలు చేస్తున్నదే లేదన్నది రోగుల గగ్గోలు. దీనికి తోడు కరోనా వైద్యం చేయడానికి అనుమతి లేని ఆసుపత్రులు సైతం కోకొల్లలు. అయినా వీటిని నియంత్రణ చేయాలిసిన వ్యవస్థలు నిద్రాణంలో ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వైరస్ మరింత విజృంభిస్తుందన్న నిపుణుల హెచ్చరికల నేపధ్యంలో ప్రభుత్వాలు మేల్కొని ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీకి చెక్ పెట్టక పోతే సామాన్యుల పరిస్థితి అంతే సంగతి అన్న ఆందోళన సర్వత్రా నెలకొంది.

## చనిపోయిన మూగజీవులను మాంసం చేసి అమ్ముకుంటున్నారు ఉపేంద్ర



కౌతాళం( విభారె ప్రతినిధి) ::చనిపోయిన గొర్రెలు, మేకలు, కోళ్లను మాంసం చేసి అమ్ముకుంటున్నారని గ్రామస్తులు వాటిని తిని అనారోగ్యానికి గురైతున్నారని ఉపేంద్ర, రామకృష్ణ, లింగన్న,వాపోయారు. గొర్రెలు, మేకలు, కోళ్ల పరీక్షలు జరిపి నిర్ధారించిన్నప్పుడే వాటిని మాంసం గా విక్రయించాలని కానీ కమేలలో నిర్ధారించ కుండానే మాంసం విక్రేయ దారులు కోసేసి మాంసం గా అమ్మేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే కోవిడ్ రెండవ స్టేజ్ లో ఉండడటం తో భయాందోళనకు గురవుతున్నారాని వాటితో పాటు చనిపోయిన జీవులు కోయడంతో అనారోగ్యానికి గురైపోతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని మండల కార్యాలయంలో ఎంపీడీఓ ,పశువైద్యులు డాక్టర్ దినకర్ కు,మరియు పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ పాల్ దినకర్ కు వినతిపత్రాన్ని అందించారు. వారిపై చర్యలు తీసుకోని ప్రజల అరోగ్య లను కాపాడాలని వారు కోరారు.విరితో పాటు లింగన్న, రామకృష్ణ, ఉన్నారు.

## గురుకుల పాఠశాల విద్యార్థులు కు స్టడీ మెటీరియల్స్ పంపిణీ

చీమకుర్తి ( విభారె విలేకరి) ప్రకాశం జిల్లా చీమకుర్తి లో గురుకుల పాఠశాలలో మంగళవారం బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్యంలో 10 వ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్స్ ను ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి ల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్స్ ఉచిత పంపిణీ కార్యక్రమం ఎంతోమంది పేద విద్యార్థులకు ఓ వరంలా మారిందన్నారు.విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా టెక్ట్స్ బుక్స్ తో పాటు స్టడీ మెటీరియల్స్ ఎంతో అవసరమని తెలిపారు. నియోజకవర్గం లోని ఎంతో మంది పేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం బుక్స్ మరియ స్టడీ మెటీరియల్నుఉచితం గా అందిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ట్రస్ట్వారికిప్రత్యేకంగాకృతజ్ఞతలు తెలియచేస్తున్నామన్నారు. విద్యార్థులు మాట్లాడుతూపాఠాలను సులభంగా అర్థం చేసుకుని నాలెడ్జ్ ను పెంచుకునేందుకు మరియు మంచి మార్కులు తెచ్చుకునేందుకు ఆల్ ఇన్ వన్ ఒంటి స్టడీ మెటీరియల్స్ ఎంతో ఉపయోగక రమని ఇంతటి విలువైన స్టడీమెటీరియల్స్ ను ఉచితంగా నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ అందజేసినందుకు బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి ట్రస్ట్ వారికి కృతజ్ఞతలు తెలిపుతున్నామన్నారు. బూచేపల్లి వెంకాయమ్మ, చీమకుర్తి మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, వైస్ చైర్మన్ బాపతు వెంకట రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## సాంప్రదాయ బద్ధ శ్రీరామనవమి వేడుకలను కరోనా నియమ నిబంధనలతో ఆచరించాలి

నెల్లూరు ( విభారె విలేకరి) సుప్రసిద్ధ హిందూ సాంప్రదాయ బద్ధంగా నిర్వహించబడుతున్న శ్రీరామనవమి వేడుకలను, ప్రస్తుత కరోనా వైరస్ నేపథ్యంలో నియమ నిబంధనలకు లోబడి శ్రీరామనవమి వేడుకలలో పాల్గొనవలసిందిగా శ్రీ వరసిద్ధి వినాయక అభయ హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షులు ఐనకోట మధుసూదన్ పిలుపునిచ్చారు. స్థానిక పొదలకూరు రోడ్డు ప్రగతి నగర్ ప్రాంతంలో ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక హనుమాన్ ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించబోవు శ్రీరామనవమి ప్రత్యేక పూజ ఏర్పాట్లను ఆయన మంగళవారం పరిశీలించారు. ప్రస్తుత వేసవి తాపానికి తగ్గట్టుగా ప్రజలను స్వామివారి భక్తులను చల్లటి చలువ పందిళ్ళు నీడలో సేదతీరుతూ స్వామివారి సేవా కార్యక్రమంలో పాల్గొనే విధంగా దుబాయ్ విజయ్ సౌజన్యంతో చలువ పందిళ్ళు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ తొలుత తన తండ్రి అయిన ఐనకోట పెద్ద మస్తానయ్య 45 సంవత్సరాల క్రితం వినాయక విగ్రహ స్థాపించి, స్తోమత కలిగిన మేరకు ఆలయ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఆనాటినుండి యదావిధిగా శ్రీ వినాయక స్వామి వారికి అనునిత్యం పూజలు నిర్వహించే వారని తెలిపారు. కాలక్రమేణా అయోధ్య రామ మందిర భూమి పూజ మహోత్సవం సందర్భంగా తాను శ్రీ ఆంజనేయ విగ్రహాన్ని ఆవిష్కరించడం జరిగింది అన్నారు. శ్రీ రామ నవమి ఉత్సవాలలో భాగంగా బుధవారం శ్రీ వరసిద్ధి వినాయక అభయ హనుమాన్ ఆలయం ప్రాంగణంలో శ్రీరామ,



సీత, లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా బెల్లం పానకం, వడపప్పు, అన్నప్రసాదాలు పంపిణీ ఉంటుందన్నారు. అన్నప్రసాద కార్యక్రమాలకు ఉభయ దాతలుగా తులసి రామ్, మోహన్ రెడ్డి, హరి తదితరులు నిర్వహణ కార్యక్రమాలు చూస్తారు అని చెప్పారు. రామ రాజ్యం స్థాపన దిశగా గత 45 సంవత్సరాలుగా నిర్వహించబడుతున్న శ్రీ శ్రీ స్వామి వారి కార్యక్రమాలలో భాగంగా బుధవారం నిర్వహించనున్న హిందూ సాంప్రదాయ శ్రీరామనవమి వేడుకలలో పొదలకూరు రోడ్డు ప్రాంత నివాసులైన ప్రగతి నగర్, గౌతమ్ నగర్, సారాయి అంగడి, పిండి మిల్లు సెంటర్ తదితర ప్రాంత ప్రజలు స్వామివారి శ్రీ రామ నవమి ఉత్సవ పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామి ఆశీర్వాదాలు పొందాల్సిన దిగా పిలుపునిచ్చారు.

## కోవిడ్ ఆసుపత్రిలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలి

తిరుపతి ,( విభారె విలేకరి), ,ఏప్రిల్ 20, తిరుపతిలోని స్విమ్స్ కోవిడ్ ఆసుపత్రిలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేయాలని టిటిడి ఈవో డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీ హరినారాయణ్‌ను కోరారు. టిటిడి పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్, టిటిడి అధికారులతో కోవిడ్ -19 వ్యాప్తిపై ఈవో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ కోవిడ్ ఆసుపత్రిలో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసి, తద్వారా ఎప్పటికప్పుడు కోవిడ్ బాధితులకు మరింత మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఇందులో భాగంగా కోవిడ్ బారిన పడిన బాధితుల పర్యవేక్షణకు ఒక నోడల్ అధికారిని జిల్లా యంత్రాంగం తరపున నియమించాలన్నారు. తిరుచానూరులోని శ్రీ పద్మావతి నిలయం, తిరుపతిలోని విష్ణునివాసం, శ్రీనివాసం వసతి సముదాయాలను గత సంవత్సరము వలే కోవిడ్ బాధితులకు వినియోగించాలని కలెక్టర్‌ను కోరారు. రెల్వేస్టేషన్ వెనుక వైపు ఉన్న రెండవ, మూడవ సత్రాలను కలెక్టర్ పరిధిలో ఉంచాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ప్రస్తుతం స్విమ్స్‌లో 450 బెడ్లు ఉన్నాయని, ఐదవ అంతస్తులో జరుగుతున్న పనులను త్వరిత గతిన పూర్తిచేసి కోవిడ్ బాధితులకు అందుబాటులోనికి తీసుకురావాలన్నారు. టిటిడి పరిధిలోని ఎస్వీ ఆయుర్వేద ఆసుపత్రిలో ఉన్న బెడ్లను కోవిడ్ బాధితులకు పూర్తిగా వినియోగించాలని, ఆసుపత్రి సిబ్బంది మూడు షిఫ్టుల వారిగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. అవసరమైతే జిల్లా యంత్రాంగం ఈ ఆసుపత్రికి మరికొంత మంది సిబ్బందిని సమకుర్చాలన్నారు. స్విమ్స్ ఆసుపత్రికి వీల్ చైర్స్, స్ట్రెచర్స్, తదితర అవసరమైన వాటిని కొనుగోలు చేయాలన్నారు. కోవిడ్ బాధితులకు కోవిడ్ క్వారంటైన్ సెంటర్లల్లో, ఆసుపత్రులలో గత సంవత్సరం పేషంట్లకు



టిటిడి నిధుల ద్వారా నాణ్యమైన భోజనం అందించారని, అదేవిధంగా ఈ సంవత్సరం కూడా సరుకులు అందించాలని కలెక్టర్ ఈవోను కోరారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఈవో ఆదేశించారు. అదనపు ఈవో శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి మాట్లాడుతూ తిరుమలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కోవిడ్ - 19 వ్యాప్తి చెందకుండా కట్టు దిట్టమైన చర్యలు చేపట్టిన్నట్లు తెలిపారు. టిటిడి రేడియో అండ్ బ్రాడ్ కాస్టింగ్ ద్వారా కోవిడ్ నిబంధనలు, జాగ్రత్తలపై భక్తులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. తిరుమలలో అవసరమైనన్ని శానిటైజర్లు, మాస్కులు అందుబాటులో ఉన్నట్లు ఆయన ఈవోకు వివరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీ పి.ఎస్.గిరిషా, జాయింట్ కలెక్టర్ శ్రీ వీరబ్రహ్మం, స్విమ్స్ డైరెక్టర్ డా. వెంగమ్మ, డిఎమ్‌హెచ్‌వో శ్రీ పెంచలయ్య, టిటిడి ఇంచార్జ్ సిఎమ్‌వో డా. మురళీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సమాజహితమే సాహిత్యం

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు



రాజమహేంద్రరం, ( విభారె విలేకరి) సమాజహితానికి సాహిత్యం ఎంతో దోహదపడుతుందని, కష్టాలైన, కనీళైన, కరోనయైన సాహిత్యం తనదైన శైలీలో ప్రజలను చైతన్యవంతులను చేస్తుందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మంగళవారం ప్లవనామ సంవత్సర ఉగాది జాతీయ కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. విశ్వవిద్యాలయం తెలుగుశాఖ, శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనానికి కన్వీవనర్ గా డా.తరపట్ల సత్యనారాయణ వ్యవహరించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ సాహిత్యం ప్రజలను చైతన్యవంతులను చేస్తుందని కష్టనష్టాలలో, ఆపదలో, విపత్తులలో సాహిత్యం తోడుగా ఉంటుందని అన్నారు. కరోనా సమయంలో అవగాహన కల్పిస్తూ సాహిత్యం ప్రజలను చైతన్యవంతులను చేసిందని తెలిపారు. మానవుడు ఎంత అభివృద్ధి చెందుతున్న అంతకు మించిన సమస్యలను ఎదుర్కొవలసి వస్తుందని చెప్పారు. ప్రకృతికి విరోదంగా మానవుడు ఏమీ సాధించలేడన్నది అనేక సందర్భాలలో రుజువు అవుతుందని దానిని గ్రహించి ప్రకృతితో మమేకమవుతూ జీవనాన్ని సాగించాలని తెలిపారు. ప్రకృతితో సఖ్యతను పెంచే గొప్ప ఔషదం సాహిత్యమని దానిని సమర్థవంతంగా భవి కవులు ఉపయోగించుకోవాలని తెలియజేసారు. సమాజహితమే సాహిత్యమని అటువంటి సాహిత్యాభివృద్ధి పాటుపడుతున్న కవులను అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ ఉగాది జాతీయ కవి సమ్మేళనానికి విచ్చేసిన కవులను నిర్వహకులను అభినందించారు. అతిథులుగా విచ్చేసిన శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డా.కత్తిమండ ప్రతాప్, తూర్పుగోదావరి జిల్లా సెట్రాజ్ సి.ఇ.ఓ ఎం.భానుప్రకాష్ మాట్లాడుతూ నేటికాలంలో వస్తున్న సాహిత్యం, కవుల దోరణి, కథవస్తువుల ఎంపిక తదితర అంశాలను ప్రస్తావించారు. అనంతరం అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేసారు. ఈ కార్యక్రమంలో ఫిలోత్రోఫిస్ట్ సోసైటి అదంకి రాజా, చిద్దం సునీత, చిట్టే లలిత, ఐడ్ల సంధ్య, ఆయా ప్రాంతాల నుండి విచ్చేసిన కవులు, కవియిత్రిలు పాల్గొన్నారు.రైటప్: సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

## వర్షకు కరోనా పాజిటివ్ !







భారతదేశంలో పెద్ద ఎత్తున కరోనా కేసులు నమోదవుతున్న అంశం టెన్షన్ పెట్టిస్తోంది. మొదట్లో రోజుకు పది వేల నుంచి 25 వేల కేసులు నమోదవుతున్న ఇప్పుడు రెండు లక్షల నుంచి మూడు లక్షల కేసులు నమోదు అయ్యే పరిస్థితి ఏర్పడింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా పరిస్థితి దారుణంగానే ఉంది. కరోనా వైరస్ తెలుగు సినిమా ఇండస్ట్రీ మీద కూడా తన ప్రతాపం చూపిస్తోంది ఇప్పటికే చాలా సినిమాలు రిలీజ్ వాయిదా వేసుకుంటే మరి కొన్ని సినిమా షూటింగ్ లో ఉన్నాయి. షూటింగులు కూడా అర్ధాంతరంగా ఆపివేసి వాయిదా వేసుకునే పరిస్థితి కనిపిస్తోంది.ఇక ఈ వైరస్ తెలుగు టెలివిజన్ ను కూడా తాకినట్లు తెలుస్తోంది. ఇప్పటికే తెలుగులో నెంబర్ వన్ కామెడీ షో గా వెలుగొందుతున్న జబర్దస్త్ లో కరోనా పాజిటివ్ కేసు నమోదు కావడం ఇప్పుడు ఆ యూనిట్ లో అందరికీ టెన్షన్ గా మారింది. జబర్దస్త్ లో గెస్ట్ గా ఎంట్రీ ఇచ్చి టీం మెంబర్ గా మారిన వర్షకు ఇప్పుడు కరోనా వైరస్ పాజిటివ్ అని తెలుస్తోంది. ఈ విషయాన్ని ఈ భామ స్వయంగా తన సోషల్ మీడియా అకౌంట్ ద్వారా వెల్లడించింది ఆమె ప్రస్తుతం హైదరాబాద్ లోని ఒక ప్రముఖ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటుందని సమాచారం అందుతోంది.ఇక తన ఇంస్టాగ్రామ్ అకౌంట్ ద్వారా ఆమె ఒక సెల్ఫీ వీడియో రిలీజ్ చేసింది. అందులో తనకు రెండు రోజులుగా ఆరోగ్యం బాగుండడం లేదని అందుకే కరోనా టెస్ట్ చేయించుకోగా పాజిటివ్ వచ్చిందని పేర్కొంది. హాస్పిటల్స్ పరిస్థితి అసలు ఏమీ బాగోలేదు అని డెడ్ బాడీ లను చుట్టేసి పడేస్తున్నారు అని అందుకే అందరూ జాగ్రత్తగా ఉండి మాస్కులు పెట్టుకుని శానిటైజర్ వాడాలని ఆమె సలహా ఇచ్చింది. ఇక జబర్దస్త్ లో వర్ష ఇమ్మానియేల్ జోడి బాగా కుదరడంతో జబర్దస్త్ తో పాటు మరికొన్ని కార్యక్రమాల్లో కూడా ఈ జోడిని చూపిస్తూ హైలెట్ చేస్తున్నారు.. ఈ నేపథ్యంలో జబర్దస్త్ మాత్రమే కాక ఆమె పాల్గొన్న మిగిలిన కార్యక్రమాలు యూనిట్స్ కూడా ఇప్పుడు జాగ్రత్త పడుతున్నాయి





## ఆదిపురుష్ కోసం కష్టాలు పడుతున్న సీత..!

హీరో.. హీరోయిన్‌లకి కొన్ని సినిమాలు ఒప్పుకున్నప్పుడు క్రేజీగానే అనిపిస్తాయి.కానీఆసినిమా కమిటాయ్యాక పాత్రకి తగ్గట్టు తయారవడంలో అసలు కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. కథకి తగ్గట్టు మోకోవర్ కావాలంటే రూపంలో దర్శకుడి సూచనల మేరకు మారక తప్పదు. ఇక ఫిజికల్‌గా కూడా తమని తాము కొత్తగా తయారు చేసుకోవాల్సి ఉంటుంది.ఖచ్చితంగాఛాలెంజింగ్‌రోల్స్‌కమిటయినప్పుడు దేనికైనా సిద్ధప డాలి. ఇప్పుడు సీత కూడా ఇలానే సిద్ధపడి కష్టాలు పడుతుందని బీ టౌన్‌లో టాక్ వినిపిస్తోంది. డార్లింగ్ ప్రభాస్ నటిస్తున్న బాలీవుడ్ స్ట్రైట్ సినిమా ఆదిపురుష్. బాలీవుడ్ దర్శక దిగ్గజం ఓం రౌత్ ఈ సినిమాని ఎంతోప్రతిష్టాత్మకంగా తెరకెకిస్తున్నాడు. ఈ సినిమాలో ప్రభాస్ రాముడిగా కనిపించబోతున్న సంగతి తెలిసిందే. ఆయనకి జంటగా సీత పాత్రలో బాలీవుడ్ క్రేజీ హీరోయిన్ కృతిసనన్ నటిస్తోంది.అయితే సీత పాత్ర ఎలా ఉండాలో అందుకు తగ్గట్టుగా దర్శకుడు సూచనల మేరకు కృతిసనన్ సన్నబడటానికితెగ శ్రమిస్తోందట. ఇందుకోసం తిండి కూడా మానేసిందని తెలుస్తోంది.ఈ సినిమాలో స్లిమ్ లుక్ కోసం కఠినమైన డైట్ ఫాలో అవుతోందట.సీతగా మెప్పించేందుకు కృతిసనన్ చేస్తున్న ఈ హార్డ్ వర్క్‌కి చిత్ర యూనిట్ ప్రశంసలు కురిప్పితున్నట్టు తెలుస్తోంది. ఇదొక్కటే కాదు కృతి సనోన్ తనకు తానుగా తెలుగు డబ్బింగ్ చెప్పుకునేందుకు నిపుణుడైన కోచ్‌ని నియమించుకుని భాషకు సంబంధించిన శిక్షణ తీసుకుంటుందని దర్శకుడు వెల్లడించాడు. ఈ సినిమాలో సీత పాత్రకు డైలాగులు చాలానే ఉంటాయట. అందుకే సొంతగా డబ్బింగ్ చెప్పుకునేందుకు రెడీ అవుతోంది. ఇక ఆదిపురుష్‌లో సైఫ్ అలీఖాన్ లంకేష్‌గా.. సన్నీసింగ్ లక్ష్మణుడిగా నటిస్తున్న సంగతి తెలిసిందే.



## ఆరున్నర కోట్ల భారీ సెట్లో శ్యామ్ సింగరాయ్



హైదరాబాద్: నాని కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న చిత్రం 'శ్యామ్ సింగరాయ్'. ఇటీవల విడుదలైన ఈ సినిమా ఫస్ట్‌లుక్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆడియన్స్‌లో సినిమా పట్ల మరింత ఆసక్తిని క్రియేట్ చేస్తూ అటు ఇండిస్ట్రీలోనూ ఇటు ప్రేక్షకుల్లోనూ అంచనాలను భారీగా పెంచేసింది.తాజాగా ఈ సినిమా కోసం ఆర్ట్ డైరెక్టర్ అవినాష్ కొల్ల, కోల్‌కతాను తలపించే భారీ సెట్‌ను హైదరాబాద్‌లో రీ క్రియేట్ చేశారు. ఆరున్నర కోట్ల భారీ బడ్జెట్‌తో పది ఎకరాల్లో నిర్మించిన ఈ భారీ సెట్‌లో ఫైనల్ షెడ్యూల్ షూటింగ్ జరుగుతోంది. ఈ భారీ సెట్‌లో తెరకెక్కించిన ఈ సన్నివేశాలు సినీ ప్రియులకి ఒక కొత్త అనుభూతిని పంచనున్నాయని చిత్ర యూనిట్ తెలిపింది. దర్శకుడు రాహుల్ సంకఅత్యాన్ ఓ యూనిక్ కాన్సెప్ట్‌తో 'శ్యామ్‌సింగ రారు' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో తన గత చిత్రాలకు భిన్నమైన సరికొత్త గెటప్స్‌లలో నాని కనిపించనున్నారు. ఈ సినిమాలో నాని సరసన సాయిపల్లవి, కఅతిశెట్టి, మడోనా సెబాస్టియన్ ముగ్గురు హీరోయిన్లు నటిస్తున్నారు. ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులతో ఎక్కడ రాజీ పడకుం డా నిర్మాత వెంకట్ బోయనపల్లి రూపొంది స్తున్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**